



కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్‌పై కేంద్ర మంత్రితో మాట్లాడా..

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

దేవరపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, భద్రాచలం రైల్వే లైన్ విషయంలో కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడడం జరిగిందని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం దేవరపల్లి పల్లపువీధి రామాలయం, మూడు బొమ్మల సెంటర్ వద్ద అమ్మ వార్లను మంగళవారం దర్శించుకున్నారు. ప్రధాని మోదీ అన్ని వర్గాల ప్రజలకు జీఎస్టీని అందుబాటులోకి తెచ్చారన్నారు. దసరా పండుగను అదరూ సంతోషంగా గడుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ గూడ్స్‌పై ధరలు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు ముద్రగడ క్రాంతి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనీల్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దేవంలో మరో గేదె మృతి

తాళ్లపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేవం గ్రామంలో వ్యాధి సోకిన మరో గేదె మంగళవారం మృతిచెందింది. జమ్ముల శ్రీనివాస్ గేదె రెండు రోజుల కిందట మృతి చెందగా..గెడ్డం మణికంఠకు చెందిన గేదె మంగళవారం మృతి చెందింది. రాష్ట్ర, జిల్లా వైద్యాధికారులు ఎంత ప్రయత్నం చేసినా వ్యాధి సోకిన గేదెలకు మృతి తప్పలేదు. మొత్తానికి గ్రామంలో చనిపోయిన గేదెలు 33కు చేరాయి. రైతులు మాట్లాడుతూ నాయకులు స్పందించి తమకు కొంత నష్ట పరిహారం అందిస్తే కొంత రుణాలు తీసుకుని గేదెలను కొనుగోలు చేసుకుంటామంటున్నారు.

రోడ్డు గోతిలో పడి..ఇళ్లలోకి దూసుకుపోయిన బస్

పెరవలి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రోడ్డు గోతిలో పడి ఆర్టీసీ బస్ స్టీరింగ్ ఒక్కసారిగా తిరగ డంతో పెద్ద ప్రమాదం జరిగింది.. తణుకు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ఆర్‌టీసీ బస్సు నిడదవోలు - నరసాపురం రహదారిపై తీపర్రు వద్ద అదుపుతప్పి ఇళ్ళపైకి దూసుకుపోయింది. రోడ్డుపై గోతులు ఉండటంతో గోతులో పడిన ఆర్‌టీసీ బస్సు స్టీరింగ్ వదిలి వేయడంతో కుడివైపు ఇళ్లపైకి దూసుకుపోయినట్టు డ్రైవర్ పోలీసులకు తెలిపాడు. ఈ ప్రమాదంలో పెరవలి వైపు మోటారు సైకిల్‌పై వస్తున్న కడింపాడుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సలాది సత్యనారాయణ (అన్నవరం) (50) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని తీపర్రుకు చెందిన జనసేన నాయకుడు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ కారులో తణుకు ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించాడు. అయితే చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. బస్సు నిండుగా ప్రయాణికులు ఉన్నప్పటికీ వారికి ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

- ప్రమాదంలో ఒకరి మృతి
- ప్రయాణికులంతా క్షేమం



మృతుడు సత్యనారాయణ



ఇళ్లలోకి దూసుకుపోయిన బస్సు..



అమ్మా.. కోట సత్తెమ్మ

నిడదవోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోటసత్తెమ్మ ఆలయంలో మంగళవారం రెండో రోజు దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంత్రం హోమం చేశారు. సుమారు 224 మంది భక్తులు అమ్మవారి ప్రత్యేక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు.



సాగుకు.. సౌరభం!

వ్యవసాయానికి సోలార్ విద్యుత్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగుకు సోలార్ విద్యుత్ రాబోతోంది. ఇకపై పగటిపూటే తొమ్మిది గంటలపాటు విద్యుత్‌ను అన్నదాతలు వినియోగించుకోవచ్చు. తద్వారా వ్యవసాయానికి విద్యుత్ బెంగ తీరబోతోంది. ఈ మేరకు ట్రాన్స్‌కో రూ.162 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించడానికి అడుగులు వేసింది. దీని ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కేవలం పగటి పూట రైతులు వాడుకునేందుకు మాత్రమే సరఫరా చేయనుంది. తద్వారా రైతులు విద్యుత్ కోసం రాత్రి వేళల్లో పడిగాపులు కాసే పరిస్థితులు తప్పనున్నాయి. కాకినాడ జిల్లాలో పోలవరం కాలువ వెంబడి మురారీ నుంచి తేటగుంట వరకు 11 చోట్ల, రాజమహేంద్రవరం జేగురుపాడులో 30 ఎకరాల్లో మరోచోట ఈ భారీ సోలార్ పవర్ ప్లాంట్లు రాబోతున్నాయి. పీఎం కుసుమ్ కింద వీటి నిర్మాణ పనులను తాజాగా పేరాడిమ్ టెక్నాలజీ, నోవల్ లాజిటెక్ సంస్థలు దక్కించుకున్నాయి. ఏడాదిలోగా ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయనున్నాయి. కాకినాడ జిల్లాలో 11 ప్రాజెక్టులకు రూ.150 కోట్లు, జేగురుపాడు సోలార్ ప్లాంట్‌కు రూ.12 కోట్లు ఖర్చుకానుంది. సోలార్ పవర్ ప్లాంట్లను దక్కించుకున్న సంస్థలు ఇటీవల స్థల పరిశీలన పూర్తి చేశాయి.

ఇక బెంగ తీరినట్లే...

వ్యవసాయాధారిత జిల్లా ఉమ్మడి తూర్పుగోదావరి. వరి, వాణిజ్య పంటల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే మంచి ప్రగతి సాధిస్తున్నారు. అయితే వీరిలో విద్యుత్ మోటార్లపై ఆధారపడి సాగు చేస్తోన్న వారి సంఖ్య అధికమే. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 70 వేల వరకు ఉన్నాయి. వీటిలో సాగుకు పక్కాగా తరచూ విద్యుత్ వినియోగిస్తోన్న కనెక్షన్లు 51 వేలు ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తోంది. 49 వేల మంది రైతులు వినియోగించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు 3.10 లక్షల కిలోవాట్స్ లోడ్ అవసరం అవుతోంది. అంటే 500 మిలియన్ యూనిట్లపైనే. ఈ మొత్తం విద్యుత్‌ను అన్నదాతలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందుకు ఏటా రూ.300 కోట్ల వరకు ఆర్థిక భారం పడుతోంది. లోడ్ అంతరాయాలు లేకుండా ఇప్పటికే మూడు ఈహెచ్‌టీ విద్యుత్ ఉప కేంద్రాల్లో రూ.148 కోట్లతో 33 కేవీ ఫీడర్లు ఏర్పాటు చేశారు. ఇందులో రూ.38.41 కోట్లతో 25 పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచారు. మరో 19 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. ఇంత చేసినా తీవ్ర వేసవి సమయంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం కష్టం అవుతోంది. దీంతో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కోతలు విధించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో అత్యవసర సమయంలో నీరందరక పంటలు ఎండి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై సాగుకు విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకూడదనే లక్ష్యంలో భాగంగా పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద ట్రాన్స్‌కో అధికారులు సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించారు.

- రైతులకు తీరనున్న సమస్య
- పగలు 9 గంటలు సరఫరా
- రెండు జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటు
- రూ.162 కోట్లతో 12 ప్రాజెక్టులు
- ఏడాదిలోపు పూర్తికి ఒప్పందం
- ఉత్పత్తయ్యే విద్యుత్ గ్రిడ్‌కు..

సోలార్ ప్లాంట్లు ఏర్పాటు

పీఎం కుసుం పథకం కింద పగటి పూట తొమ్మిది గంటలు సోలార్ విద్యుత్ సరఫరా చేయడానికి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 12 చోట్ల సోలార్ పవర్‌ప్లాంట్లను నిర్మించాలని నిర్ణయించారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక ఉత్పత్తయ్యే విద్యుత్‌కు గ్రిడ్‌ను అనుసంధానించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కు మాత్రమే సరఫరా చేయనున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో రూ.150 కోట్లతో 11 చోట్ల వీటిని నిర్మించనున్నారు. స్థల సమస్య ఉండడంతో పోలవరం కాలువ వెంబడి నిర్మిస్తున్నారు. జగ్గంపేట నియోజవర్గం గండేపల్లి మండలం మురారీ నుంచి తుని నియోజకవర్గం తేటగుంట వరకు కాలువ వెంబడి సోలార్ పవర్ ప్లాంట్లు రానున్నాయి. గండేపల్లి మండలం బొర్రంపాలెంలో 16 ఎకరాల్లో, ఉప్పలపాడులో 11, గండేపల్లిలో 23, మురారి 8, నాయంకపల్లి 10.40 ఎకరాలు, జగ్గంపేటలో 25.73, ప్రత్తిపాడులో 16, అన్నవరం 17.36, కత్తిపూడి 11.49, తుని రూరల్ తేటగుంటలో 1.79, తుని చామరవరంలో 24.07 ఎకరాల్లో మొత్తం 173.65 ఎకరాల్లో సోలార్ పవర్‌ప్లాంట్లు రాబోతున్నాయి. మొత్తం కాలువ వెంబడి స్థలాల్లో ఐదు నుంచి పదెకరాల వరకు ఉన్న చోట్ల 8 మెగావాట్ల వరకు, తక్కువ స్థలం ఉన్నచోట్ల రెండు నుంచి నాలుగు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ప్లాంట్లను స్థాపించనున్నారు. మొత్తం అన్నీ కలిపి 173.65 ఎకరాల్లో 40 మెగావాట్ల సామర్థ్యంతో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇవి రాబోతున్నాయి.

కోనసీమలో మాత్రం..

వీటికి ఇటీవల టెండర్లు పిలిచారు. కాకినాడ జిల్లాలో ప్లాంట్ల నిర్మాణ పనులను పేరాడిమ్ టెక్నాలజీ సంస్థ దక్కించుకోగా, తాజాగా కంపెనీ ప్రతినిధులు అన్ని స్థలాలను పరిశీలించి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజ మహేంద్రవరం సమీపంలోని జేగురుపాడులో 30 ఎకరాలు గుర్తించారు. ఇక్కడ 9.5 మెగా వాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించనున్నారు. ఈ పనులను నోవల్‌లాజిటెక్ సంస్థ దక్కించుకుంది. ఇందుకు రూ.12 కోట్ల వరకు ఖర్చు కానుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండుచోట్ల సోలార్ ప్లాంట్లను నిర్మించడానికి ప్రయత్నించినా స్థల సమస్యతోపాటు ఎక్కడికక్కడ చెట్లు అడ్డు తగులుతుండడంతో సోలార్ విద్యుత్‌కు సరిపడా ఎండ లభించదనే నిర్ణయానికి ప్రస్తుతం వచ్చారు.

అధ్యక్షా!



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రైవేటీకరణ.. పీపీపీకి తేడా తెలియని వైసీపీ

అసెంబ్లీలో ఎమ్మెల్యే వాసు

రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు 4వ రోజు మన జిల్లా ఎమ్మెల్యేలు తమ వాణి వినిపించారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి వాసు పలు సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు.

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలల విషయంలో ప్రైవేటీకరణకు, పీపీపీకి మధ్య తేడా తెలియక వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. పీపీపీ విధానం ఏదో మన రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా చేస్తున్నట్టు వారు మాట్లాడుతున్నారు కానీ ఇప్పటికే కస్తూరిబా మెడికల్ కళాశాల (బెంగళూరు) పీపీపీ మోడ్‌లో నడుస్తుందన్నారు. శాంతి నికేతన్ మెడికల్ కళాశాల (పశ్చిమబెంగాల్) పీపీపీ మోడ్‌లో నడుస్తోందని, త్రిపుర మెడికల్ కళాశాల త్రిపుర , కర్ణాటకలో 11 మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించి అతి త్వరలో ప్రారంభించనున్నారన్నారు. రాజమహేంద్రవరంలోని మెడికల్ కళాశాలకు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో రెండేళ్లలో ఖర్చుచేసింది కేవలం రూ.10 కోట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ 15 నెలల్లో ఖర్చుచేసింది రూ.32 కోట్లు అన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మరుగునపడిపోయిన రాజమండ్రి అల్లురామలింగయ్య హోమియో కళాశాలకు చెందిన 23 సీట్లు మంత్రి సత్యయాదవ్‌తో మాట్లాడి సాధించుకోగలిగామని గుర్తుచేశారు. రాజమహేంద్రవరం ప్రభుతాసుపత్రిలో సూపర్ స్పెషాలిటి సేవలు అవసరం ఉందని సభ దృష్టికి తీసుకెళ్లారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి వైసీపీ వాళ్లు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.వైసీపీ వాళ్ల రాష్ట్రానికి ప్రజలకు చెడుమాత్రం చేయవద్దన్నారు.

ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలి : ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. డివిజన్ కేంద్రమైన కొవ్వూరులో 50 పడకల ఆసుపత్రి ఉందని.. అయితే జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో అత్యవసర కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు.ఇటీవల ఐదేళ్ల ఐదేళ్ల పూర్తయిందని వైద్యులు, వైద్య సిబ్బందిని బదిలీ చేశారన్నారు.బదిలీ అయిన వారి స్థానంలో కొత్త వారిని నియమించలేదన్నారు.కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లోని పీహెచ్‌సీలలో సిబ్బంది కొరత అధికంగా ఉండడంతో సకాలంలో వైద్యం అందడం లేదన్నారు. వైద్యులు,వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

వైసీపీలో కొన్న భూములపై విచారణ చేయాలి

మండలిలో ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలకు సేకరించిన భూముల రేట్లపై అనుమానాలు ఉన్నాయని, ఎన్ని ఎకరాలు ఎంత ధర పెట్టి కొన్నారు అనే అంశాలపై విచారణ చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. శాసన మండలిలో మంగళవారం ఈ విషయాలను ప్రస్తావించారు. అపరిష్కృతంగా మిగిలిన టిడ్కో ఇళ్లపై త్వరగా ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, అయినా దీనిపై రాజకీయ రాద్ధాంతానికి తెరలేపారన్నారు. నష్టాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

రేపటి నుంచి జీఎస్టీ సదస్సులు

అక్టోబరు 19న బాణాసంచాలతో సెలబ్రేషన్స్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ 2.0 విధానంతో పలు రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. కానీ మార్కెట్‌లో పాత సరుకు ఉందనే కారణంతో చాలా వస్తువుల ధరలు తగ్గించలేదు. సుమారు 15 రోజుల్లో కొత్త సరుకు రావొచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కేవలం కార్లు, ఏసీలు, టీవీలు వంటి ధరలు మాత్రమే కొద్దిగా తగ్గినట్టు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ దుకాణం వద్ద సరుకు పాత ధర.. జీఎస్టీ తగ్గిన తర్వాత అమల్లోకి వచ్చిన ధరల వివరాలతో బోర్డులు పెట్టాలి. కానీ ఇంకా ఎవరూ పెట్టలేదు. పైగా ప్రజలకు అవగాహన లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీఎస్టీ 2.0 విధానంపై పెద్దఎత్తున ప్రచారం చేయనుంది. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకూ అవగాహన సదస్సులు జరుగనున్నాయి.25 నుంచి 29వ తేదీ వరకూ నిత్యావసరాలు, గృహస్తులకు ఎంత సేవింగ్ అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నారు. ఈ నెల 30 నుంచి అక్టోబరు 6వరకూ వ్యవసాయం ఇతర వృత్తులకు సంబంధించిన వాటిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. అక్టోబరు 7 నుంచి 13 వరకూ హెచ్‌ఆర్‌డీ, టెక్నాలజీ, డిజిటల్ ఎంపవర్‌మెంట్ అంశాలపై అవగాహన కలిగిస్తారు. అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకూ డెవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్, వెల్త్ క్రియేషన్, వికాస్ విశ్వాస్ పేరుతో సదస్సులు నిర్వహిస్తారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సదస్సుల్లో పాల్గొనాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ 27వ తేదీ వరకూ ఉంటుంది. అనంతరం జిల్లా స్థాయి మీటింగ్‌లో ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. 19వ తేదీన బాణసంచా కాల్పులతో సెలబ్రేషన్ ఆఫ్ సేవింగ్స్ పేరిట జీఎస్టీ 2.0 పండగ నిర్వహించనున్నారు.అన్ని స్థాయిల్లోని సుమారు 58 శాఖల అధికారులు భాగస్వాములు కానున్నారు.

బాల్య వివాహాలు చేయవద్దు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి స్పష్టం చేశారు. ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణ, న్యాయ పరమైన అంశాలపై ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.బాల్య వివాహాల వల్ల సమాజానికి కలిగే హాని, చట్టపరంగా విధించే శిక్షలపై వివరించారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, వాడకం, సర ఫరా, నిల్వ వంటివన్నీ క్రిమినల్ నేరాల పరిధి లోకి వస్తాయన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడిన వాళ్లు వాటి నుంచి బయటపడి న్యాయపరమైన జీవితం సాగించ డానికి స్వచ్ఛందంగా సహాయం కోరితే వాళ్లపై ఎలాంటి కేసులు ఉండవని,నేర విచారణ ఉండదని చెప్పారు.ఉచిత వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. నల్సా వారి మాదక ద్రవ్యాల బాధితులకు న్యాయ సేవలు, మాదకద్ర వ్యాల నిషేధ పథకం-2025 కింద అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రేపు బెజవాడకు డీఎస్సీ అభ్యర్థులు

- నేడు రాజమండ్రిలో రిజిస్ట్రేషన్
- ఇక్కడి నుంచే విజయవాడకు
- 3315 మంది అభ్యర్థులు
- 72 ఆర్టీసీ బస్‌లు ఏర్పాటు
- 5 పాఠశాలలు కేటాయింపు

రాజమహేంద్రవరం/అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ - 2025లో విజయం సాధించిన 3315 మంది ఉపాధ్యాయ అభ్యర్థులను రాజమహేంద్రవరం నుంచి ఈనెల 25న విజయవాడలో జరిగే సభకు తీసుకెళ్లనున్నారు. తూర్పుగోదావరి జిల్లాతో పాటు కాకినాడ, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఎంపికైన కొత్త టీచర్లను 72 బస్సుల్లో తరలిస్తారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ఈ సభలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. సీఎం చేతుల మీదుగా కొత్త టీచర్లకు నియామకపత్రాలు అందజేస్తారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి 50 బస్సులు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి 10 బస్సులు, కాకినాడ నుంచి 12 బస్‌లు బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం చేరుకుంటాయి. ఇక్కడి నుంచే విజయవాడ వెళతాయి. ఇప్పటికే స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి బస్సులను పంపడంలో ఆర్టీసీ అధికారులు తలమునకలై ఉన్నారు. విజయవాడ సభకు బస్సులు కేటాయించాల్సి రావడం ఆర్టీసీ అధికారులకు కత్తిమీదసాములా మారనుంది.

నేడు పేర్లు రిజిస్ట్రేషన్..

విజయవాడ వెళ్లే ఉపాధ్యాయ అభ్యర్థులకు కొన్ని ఎంపిక చేసిన స్కూళ్ల వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేశారు. ఈ స్కూళ్ల వద్దనే వీరంతా బస్సులు ఎక్కాల్సి ఉంటుంది. రాజమహేంద్రవరం శ్రీరామనగర్‌లోని బీవీఎం ఉన్నతపాఠశాల, మోరంపూడిలోని శ్రీచైతన్య ఉన్నతపాఠశాల, లాలాచెరువు మునిసిపల్ ఉన్నతపాఠశాల, శంభూనగర్ ఫ్లైఓవర్ కింద బాలాజీ పేట సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, బొమ్మూరు ప్రభుత్వ డైట్ కళాశాల దగ్గర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలను కేటాయించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వారు ఒక సహాయకుడు /సహాయకురాలితో కలిసి బుధవారం సాయంత్రం 4 గంటలకు వారికి కేటాయించిన పాఠశాలల వద్ద రిజిస్ట్రేషను నిమిత్తం హాజరుకావాలని ఆదేశించారు.అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు,ఆధార్, కాల్ లెటర్, దుప్పటి, తలగడ, గొడుగు తెచ్చుకోవాలన్నారు.24న వసతి, రాత్రి భోజనం,25న ఉదయం అల్పాహారం, విజయవాడకు బస్సు సదుపాయం కల్పించామన్నారు.

విజయవాడ నుంచే దసరా బస్‌లు

- జిల్లా నుంచి 170 కేటాయింపు
- విజయవాడ నుంచే సర్వీసులు
- 4 డిపోల నుంచి తరలింపు
- అక్కడి నుంచే నిర్వహణ
- నేటి నుంచి 2వరకు బస్‌లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్టీసీ ఈ ఏడాది దసరా స్పెషల్స్ నడపడంలేదు. షెడ్యూలు బస్సులను మాత్రమే తిప్పుతారు. స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో మాదిరిగా ఏ జిల్లాకు ఆ జిల్లా కాకుండా బస్సులన్నింటినీ విజయవాడ రప్పిస్తున్నారు. అక్కడి నుంచే అన్ని జిల్లాలకు దసరా బస్సులను ఆపరేట్ చేస్తారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా జిల్లాలోని అన్ని డిపోలకు బస్సులను పంపిస్తారు.ఈ మేరకు దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి జిల్లా ఆర్టీసీ అధికార యంత్రాంగానికి సమాచారం అందింది. దసరా పండుగ రోజుల్లో తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోలకు మొత్తం 170 బస్సులను నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. 24వ తేదీ బుధవారం 9 బస్సులు నడుపుతారు. 25వ తేదీన 16 బస్సులు ఆపరేట్ చేస్తారు. 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ 22 బస్సులు, 29వ తేదీన 24 బస్సులు వస్తాయి. 30వ తేదీ, అక్టోబరు 1న 22 బస్సులు చొప్పున, 2వ తేదీన 11 బస్సులు నడుపుతారు. 170 బస్సులు జిల్లాలోని నాలుగు డిపోలకు చెందినవే. డ్రైవర్లు, కండక్టర్లు ఇక్కడి వారే. ఆర్టీసీ సిబ్బంది ప్రతిరోజూ బస్సులను విజయవాడ తీసుకెళ్లి అక్కడి అధికారులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా విజయవాడ అధికారులు బస్సులను జిల్లాకు పంపిస్తారు.ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ ఈ బస్సులు నడుపుతారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇబ్బంది పడ కుండా బస్‌లు నడిపేలా చర్యలు చేపట్టాం.



170 బస్‌లు పంపుతున్నాం..



దసరా పండుగ నేపథ్యంలో జిల్లాకు వచ్చే ప్రజల సౌకర్యార్థం విజయవాడకు 170 బస్సులు పంపుతున్నాం. ఇవన్నీ అదనపు సర్వీసులు. అక్కడి నుంచే ఈ బస్సులను ఆపరేట్ చేస్తారు. మహిళల ఉచిత ప్రయాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- వైఎస్ఎన్.మూర్తి,జిల్లా ప్రజారవాణా అధికారి



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి కూడలిలోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన హోర్డింగ్

జర భద్రం

ట్రాఫిక్ రూల్స్ పాటించు..

జాగ్రత్తగా ఇంటికి వెళ్తావు

జాతీయ రహదారులపై ఆలోచింప చేస్తున్న సందేశాత్మక హోర్డింగులు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

జర భద్రం... రహదారులపై ప్రయాణించే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ జాతీయ రహదారుల వెంబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీసు శాఖ ఏర్పాటుచేసిన సందేశాత్మక హోర్డింగులు అందరినీ ఆలోచింపచేస్తున్నాయి.

కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి తిమ్మాపురం వరకు గల 216 జాతీయ రహదారి, తుని నుంచి రావులపాలెం, దివాన్‌చెరువు వరకు గల జాతీయ రహదారి వెంబడి పలు ముఖ్యమైన కూడళ్ల, ప్రాంతాల్లో హోర్డింగులు పెట్టారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వీటిని ఏర్పాటు చేయడంతో పాటు వాహనచోదకులకు జాగ్రత్తలు సూచించారు. ప్రతి హోర్డింగుపై 'బాగుంటావ్, ట్రాఫిక్ రూల్స్ పాటించు జాగ్రత్తగా ఇంటికి వెళ్తావు' అని ఉంది. అదే సమయంలో ఒక్కో బోర్డుపై ఒక్కో సందేశాన్ని ఇచ్చారు.

హెల్మెట్ పెట్టుకో బాగుంటావ్ అంటూ హెల్మెట్ ధరించిన వ్యక్తి ఫొటో, ప్రమాదానికి గురైన వ్యక్తి ఫొటోను ఒక హోర్డింగులో ప్రదర్శించారు.

డ్రైవింగ్ చేస్తూ ఫోను మాట్లాడకు.. బాగుంటావ్ అంటూ తూర్పు గోదావరి జిల్లాలో జాతీయ రహదారిపై డ్రైవ్ చేస్తున్న వ్యక్తి ఫోను మాట్లాడుతూ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి నిలువునా నిలుచున్న కారు ఫొటోను మరో హోర్డింగ్‌లో ప్రదర్శించారు. ఇతర ప్రాంతాల్లో ఇటువంటి వాటినే ఏర్పాటు చేశారు. ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పెట్టిన ఈ హోర్డింగులు వాహన చోదకులను ఆకట్టుకుంటున్నాయి.



కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్ కూడలి వద్ద ఏర్పాటుచేసిన హెల్మెట్ పెట్టుకో బాగుంటావ్ హోర్డింగ్

జేఎన్టీయూకేలో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'

జేఎన్టీయూకే, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకేలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 అంతర్గత మూల్యాంకన మంగళవారం జరిగింది. దీనిని ప్రిన్సిపాల్ మోహన్‌రావు ప్రారంభించగా కరుణ సమన్వయకర్తగా వ్యవహరించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది దేశవ్యాప్తంగా విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించే కార్యక్రమమని ప్రిన్సిపాల్ తెలిపారు. బెంగళూరుకు చెందిన క్రిఫీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఎండీ కె.కృష్ణారెడ్డి, సీఎస్ఈ ప్రొఫెసర్ ఎల్.సుమలత, మెకానికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కిషోర్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.మొత్తం 34 బృందాలు హాజరుకాగా ఎంపికైన బృందాలు జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో యూసీఈకే తరపున పాల్గొంటాయని ప్రిన్సిపాల్ చెప్పారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎస్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపికలు


వలంటీర్ల ఎంపిక నిర్వహిస్తున్న దృశ్యం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ పరేడ్ క్యాంప్‌లో పాల్గొనే ఉత్తమ ఎస్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేసేందుకు కాకినాడ జేఎన్టీయూ ఇండోర్ మైదానంలో మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు.ఎంపికలను హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టరేట్, ఎస్ఎస్ఎస్ సెల్, వర్సిటీ నిర్వహించాయి. ప్రాంతీయ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ సమైక్యతకు ప్రతీకలన్నారు. సమన్వయకర్త జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ రిపబ్లిక్ డే పరేడ్‌లో చోటుదక్కడం ప్రతి విద్యార్థికీ గొప్ప గౌరవమన్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన వలంటీర్లు ఢిల్లీలో జరిగే పరేడ్‌లో జేఎన్టీయూకే తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ప్రాంతీయ డైరెక్టరేట్ ప్రతినిధి సం జయ్, ఎస్ఎస్ఎస్ అధికారులు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు.

జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో కుర్రాళ్ల ప్రతిభ


రన్నర్స్‌గా నిలిచిన ఆంధ్ర క్రీడాకారులు

సామర్లకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రం పంచకులాలో ఈ నెల 13 నుంచి 22 వరకు జరిగిన యెనెక్స్ సన్‌రైజ్ అశ్వినిగుప్తా మెమోరియల్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డబుల్స్ విభాగంలో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ, చిత్తూరు జిల్లాకు చెందిన తిప్పన చరణ్‌రామ్ సత్తా చాటారు. చైనాలో వచ్చే నెలలో జరిగే ఆసియన్ గేమ్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. మంగళవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకున్న హరికృష్ణకు సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, వీరం రెడ్డి పెదబాబు, నలాది బ్రహ్మానందరావు(రమేష్), వీరం రెడ్డి నాని పూలమాలలు వేసి సత్కరించారు.

అంతర్జాతీయ నాటక ప్రదర్శనకు 'శ్రీప్రకాష్' విద్యార్థులు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు టెమిర్బెక్ జుర్గెనోవ్ కజక్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అల్మాటీ, కజకిస్థాన్, జాని బెన్కోవ్ యూనివర్సిటీ, షిమ్‌కెంట్లో, ఉజ్బెకిస్థాన్ వర్సిటీల్లో నాటక ప్రదర్శనలు ఇవ్వనున్నారని డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. నటుడు, దర్శకుడు, విద్యావేత్త, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పూర్వ విద్యార్థి కుమార్ సుమిత్ రూపకల్పన, దర్శకత్వంలో శిక్షణ పొందిన తమ విద్యార్థులు ఎల్లలు దాటి ప్రతిభ చాటనున్నారన్నారు. కింగ్ లియర్, జూలియస్ సీజర్ వంటి క్లాసికల్ షేక్స్పియర్ నాటకాలను ప్రదర్శించేందుకు పయనమై ఆ దేశాలకు వెళ్లారు. అక్టోబరు 1వరకు పలు వర్సిటీలలో పలు ప్రదర్శనలు ఇస్తారని చెప్పారు.

కాకినాడ జీజీహెచ్‌లో 2డి ఎకో సేవలు పునః ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో 2డి ఎకో సేవలు మంగళవారం పునః ప్రారంభమైనట్టు ఎన్టీఆర్ వైద్య సేవ డాక్టర్ వి.వరప్రసాద్ తెలిపారు. ఇన్ సోర్సింగ్ పరిధిలో బయటి నుంచి జీజీహెచ్‌కు హృద్రోగ వైద్య నిపుణులను తీసుకొచ్చి 2డి ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఇన్ సోర్సింగ్‌కు అనుమతి ఇవ్వడంతో 2డీ ఎకో సేవలకు మార్గం సుగమమైంది. మంగళవారం ఒక్కరోజే సుమారు 30కి పైగా పరీక్షలు చేసినట్టు డాక్టర్ వరప్రసాద్ చెప్పారు.

బొమ్మల కొలువు....

విశ్వేశ్వరీదేవి సన్నిధిలో ఆకట్టుకునేట్టు...

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేటి యాంత్రిక జీవనంలో సైతం సంప్రదాయాలను పాటిస్తూ శరన్నవరాత్రి వేళ విశ్వేశ్వరీదేవి ఆలయంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. భక్తి ప్రధానంగానే కాకుండా కళాత్మక దృష్టిని కనబరుస్తూ డాక్టర్ రాంబాబు సతీమణి సుబ్బలక్ష్మి కొలువుదీర్చిన బొమ్మలు ఆకర్షిస్తున్నాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఒకపక్కన మెట్లు, మెట్లుగా ఏర్పాటుచేసి దానిపై తెల్లటి వస్త్రాన్ని ఉంచారు. గణపతి, బాలకుమారస్వామిమధ్య పసుపు కొమ్ములను గుట్టలుగా పోసి దానిపై విశ్వేశ్వరీదేవి బొమ్మను ఉంచారు. ఒకవైపున మహాలక్ష్మి, సీత, రుక్మిణి, రాధ, లలిత, సరస్వతి, శారదాంబ, రెండోవైపున కామాక్షి, విశాలాక్షి, అన్నపూర్ణ, గాయత్రి, అర్ధనారీశ్వరుడు, బాలాత్రిపురసుందరీదేవి, మహాకాళి, కనకదుర్గ, శైలపుత్రి బొమ్మలను అందంగా అలంకరించారు. అందులో నెమలి పింఛాలను కూడా ఉంచారు. మరి ఈ బొమ్మల కొలువును మనమూ ఓసారి చూసొద్దాం.


దివాన్‌చెరువులోని శ్రీవిశ్వేశ్వరీదేవి ఆలయంలో బొమ్మలకొలువు




కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి

వైభవంగా మహా శక్తి యాగం

కాకినాడ శ్రీపీఠంలో రెండో రోజు 22 కోట్లకు చేరుకున్న లలితా సహస్రనామ కుంకుమార్చనలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో మొదలైన మహాశక్తి యాగం మంగళవారం రెండో రోజుకి చేరుకుంది. శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారికి అర్గళా స్తోత్ర హోమం, సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం నిర్వహించారు. స్వామి పరిపూర్ణానంద భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ... సకల సృష్టికి మొట్టమొదట తల్లిదండ్రులు సూర్య చంద్రులని, వారి అనుగ్రహం లేకపోతే ఆహారం పండదన్నారు. రెండో తల్లిదండ్రులైన గోమాత, వృషభం లేకపోతే ఎరువు, భూమి దున్నకపోతే పంట పండదన్నారు. మూడో తల్లిదండ్రులు రైతు అని, ఇతను పండించకపోతే ఆహారం ఉండదన్నారు. నాలుగో తల్లిదండ్రులు అమ్మ అని, ఆమె ఆహారం వండిపెట్టకపోతే మనుగడ ఉండన్నారు. మనం కేవలం కళ్లతో చూస్తే పొందే ఆనందాన్ని చక్షురానందం, ఇంద్రియ ఆనందం అంటామన్నారు. అమ్మ నామం, పారాయణ చేసి పూజిస్తే ఇంద్రియానందం పొంది అనుగ్రహానికి పాత్రులు కావచ్చన్నారు. వేలాది మంది మాతృమూర్తుల సంకల్పం, పట్టుదలతో రెండో రోజు 22కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలు పూర్తయ్యాయన్నారు. అష్టమి తిథి ప్రభావం తీవ్రంగా ఉంటుందని, దానిని తగ్గించి అందరికీ మంచికోసం అమ్మవారిని గట్టిగా ఆరాధన చేసేందుకు వీలుగా బగళాముఖి హోమం, వారాహి అమ్మవారికి ప్రత్యంగిరా హోమం, చండీ హోమంలను ప్రత్యేకంగా జరపనున్నట్టు తెలిపారు. ఈ నెల 29న సుమారు 24 వేల మంది విద్యార్థులతో త్రికోటి మహా సరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మహాశక్తి యాగంపై 'లలిత' పేరుతో సినిమా తీయబోతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. లలితాసహస్రనామంపై రాసిన పాటను బుధవారం మహాశక్తి యాగం వేదికపై జొన్నవిత్తుల సమక్షంలో ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లను సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ రామారావు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.




గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని హారతి తీసుకుంటున్న భక్తులు


దేవీచౌక్‌లో గాయత్రీ దేవిగా...

అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు... ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో దేవీచౌక్‌లో శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. నగర ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రముఖులు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని అనుగ్రహం పొందారు. దేవీచౌక్ సెంటరు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలతో వెలుగొందుతోంది. దేవాలయాల గోపురాల సెట్టింగులు, దేవతామూర్తుల లైటింగ్ బోర్డులు ఆకట్టుకుంటున్నాయి. దసరా సెలవుల కారణంగా సాయంత్రం పూట ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. రోడ్డుకిరువైపులా బొమ్మలు, చిరుతిళ్ల దుకాణాలు తిరునాళ్లను తలపిస్తోంది. రాత్రి నాట్య ప్రదర్శనలు, నాటకాలు, సినీ సంగీత విభావరులు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి వీటిని అధిక సంఖ్యలో యువత, ప్రజలు తిలకించారు.



మంగళవారం రాత్రి ఆకట్టుకున్న కాళికా నృత్య ప్రదర్శన, భక్తులతో కిక్కిరిసిన దేవీచౌక్



గాజుల దుర్గమ్మ

దేవీ శరనవరాత్రుల్లో భాగంగా కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరిలో బాలకనకదుర్గ మంగళవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రా క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీనివాస్



అంబాజీపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రంజీ క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సీనియర్ కోచ్ నిమ్మకాయల శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందినట్లు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. శ్రీనివాస్ ప్రస్తుతం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో రెండు సార్లు ఆయన రంజీ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నారు. 2005లో ఏపీ రంజీ క్రికెట్ జట్టు ప్రోబబుల్స్‌లో ఎంపికయ్యారు. అంబాజీపేటలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సబ్ సెంటర్ కోచ్‌గా శ్రీనివాస్ తన ప్రస్థానం ప్రారంభించి నేడు రాష్ట్ర జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నారు. తన ఎంపిక పట్ల ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, ఏసీఏ ఎపెక్స్ కౌన్సిల్ సభ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన తేజస్వి గాత్ర కచేరీ


కీర్తన ఆలపిస్తున్న తేజస్విని

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సరస్వతి గాన సభ 122వ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. నగరంలోని సూర్యకళా మందిరంలో విజయవాడకు లంక తేజస్వి గాత్ర కచేరీ అలరించింది. ధన్యాసి రాగంలో నిఖిలలోక నాయకి వర్ణంతో ప్రారంభించి, దీక్షితుల వారి శ్రీగణేశాత్పరం, త్యాగరాజు స్వామి బంటురీతికొలువు.. మొదలైన కృతులు గానం చేశారు. ఆమెకు వయోలిన్‌పై అంబటిపూడి కామాక్షి, మృదంగంపై కార్తికేయ, ఘటంపై సరస్వతుల హనుమంతరావు వాద్య సహకారం అందించారు. సరస్వతి గానసభ సభ్యులు, అధిక సంఖ్యలో సంగీతప్రియులు పాల్గొన్నారు..

'తూర్పు'న ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

- **రూ.1,600 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులకు శ్రీకారం**
- **వసంతవాడలో భూముల పరిశీలనలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్**


వసంతవాడలో ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆత్రేయపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటి జలాలను ప్రతి ఇంటికి అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు గాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలివిడతగా రూ.1650 కోట్లతో వివిధ నియోజకవర్గాల్లో వాటర్ గ్రిడ్ పథకం పనులను ప్రారంభిస్తున్నట్టు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం వసంతవాడ, దేశాలమ్మ పుంతలో రెండు ప్రాంతాల్లో ఈ పథకం కోసం అను వైన పంట పొలాలను ఆయన పరిశీలించారు. సుమారు పది ఎకరాలు భూసేకరణ కోసం చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సెంట్రల్ డెల్టా పరిధిలో బొబ్బర్లంక బ్యారేజీ నుంచి గోదావరి జలాలను శుద్ధి చేసి ట్రంక్ లైన్ల ద్వారా తాగునీరు అందించనున్నారు. బ్యారేజీ దిగువ నుంచి ఇన్‌టేక్ వెల్స్ నిర్మించి అక్కడ నుంచి దిగువకు మళ్లిస్తామన్నారు. దీనికి సంబంధించిన ప్లాంట్‌ను నిర్మించేందుకు భూములు పరిశీలిస్తున్నామన్నారు. సెంట్రల్ డెల్టా పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలలో ట్రంక్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. అలాగే ఈస్టర్న్ డెల్టా పరిధిలోని ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుద్ధి చేసిన జలాలను ఫిల్టర్ చేసి అనపర్తి, కాకినాడ, రామచంద్రపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలకు పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈస్టర్న్ డెల్టా పరిధిలోని 250 గ్రామాలు, సెంట్రల్ డెల్టా పరిధిలోని 635 గ్రామాలకు తొలివిడత శుద్ధి చేసిన జలాలను అందిస్తామన్నారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ ఈ కాంట్రాక్టు చేపట్టిందన్నారు. శుద్ధి చేసిన జలాలు ట్రంక్‌లైన్ల ద్వారా రక్షిత మంచ నీటి పథకాలకు అనుసధానం చేసి ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ప్రతి ఇంటి కుళాయిలకు చేరుతుంది. సురక్షిత జలాలను అందించి ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ఈ ప్రాజెక్టు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఈ ప్రాజెక్టు సంబధించిన భూములను వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ పరిశీలించారు.ఈ కార్యక్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణా రెడ్డి, అమలాపురం ఆర్డీవో శ్రీకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్లు పద్మనాభం, రవికుమార్, తహశీల్దారు రాజేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు భాగ్యరాజు, శ్రీధర్, ఎస్ఐ ఎస్.రాము, టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


భూసేకరణ పరిశీలిస్తున్న దృశ్యం

ఆరు పథకాలు.. అనేక ప్రయోజనాలు..

● గ్రామీణ ప్రజలకు తపాలా బీమాతో ధీమా
● తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్

సామర్లకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ఆరు రకాల బీమా పథకాలను అమలుచేస్తోంది. తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌లతో పాలసీదారులకు లాభాల భరోసాను ఇస్తోంది. సురక్ష, సువిధ, సుమంగళ్, సంతోష్, గ్రామప్రియ, చిల్డ్రన్ పాలసీ పేర్లతో ఆరు పథకాలను ప్రవేశపెట్టింది. ఒక్కో పథకం ద్వారా రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలు చేసుకునే అవకాశం కల్పించింది. వీటిలో ఒక్కో పథకానికి బోనస్‌ను రూ.60, రూ.48, రూ.45 చొప్పున అందించనుంది. లబ్ధిదారుడు మూడేళ్లపాటు జరిపిన చెల్లింపులపై రుణసదుపాయం కల్పిస్తోంది. ప్రీమియం చెల్లిస్తున్న సమయంలో పాలసీదారుడు మృతిచెందితే చెల్లించిన పాలసీ మొత్తాన్ని ఒకేసారి నామినీకి అందజేస్తారు. ఈ పథకాల్లో చేరదలిచినవారు ఆధార్, పాన్‌కార్డు కలిగి ఉండాలి. జిల్లాలోని ఏ పోస్టాఫీసులోనైనా ప్రీమియం చెల్లించవచ్చు. ఆదాయపు పన్ను రాయితీ, నామినేషన్ సదుపాయం, ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే అవకాశాన్ని తపాలా శాఖ కల్పించింది. పోస్టల్ జిల్లా ఉన్నతాధికారి అందించిన సమాచారం మేరకు తపాలా శాఖలో వివిధ పథకాల వివరాలు ఇలా ఉన్నాయి.

సంతోష్:
సంతోష్ పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. బోనస్ కింద రూ.1000కి రూ48 వర్తిస్తుంది. 19 ఏళ్ల లబ్ధిదారుడు పథకంలో చేరితే మెచ్యూరిటీని 35, 40, 45, 50, 55, 58, 60 ఏళ్లకు నిర్దేశించుకోవచ్చు. మెచ్యూరిటీ ఏ సంవత్సరం వరకూ అయితే నిర్దేశించుకుంటారో.. ఆ సంవత్సరం నుంచి మరో ఐదేళ్లపాటు వేచి ఉండాల్సి ఉంటుంది. అనంతరం పాలసీ మొత్తానికి రూ.48లు బోనస్‌గా అదనంగా జోడించి లబ్ధిదారుడికి అందజేస్తారు. రూ.10 లక్షల పాలసీ చేసిన లబ్ధిదారుడికి బోనస్‌తో కలిపి మొత్తం రూ.29.68లక్షలు పాలసీ మొత్తం వర్తిస్తుంది.

సురక్ష:
సురక్ష పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 సంవత్సరాల మధ్య కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. బోనస్ కింద రూ.1000కి రూ.60 వర్తిస్తుంది. 60 సంవత్సరాల వరకూ ప్రీమియం చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అనంతరం 80 ఏళ్ల తర్వాత రూ.10 లక్షలు, అందుకు సంబంధించి రూ.60 బోనస్‌తో కలిపి మెచ్యూరిటీ మొత్తాన్ని లబ్ధిదారుడికి అందజేస్తారు. లబ్ధిదారుడు మరణిస్తే ఆ మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. రూ.10 లక్షలు పాలసీ 60 సంవత్సరాల పాటు చెల్లిస్తే బోనస్‌తో కలిపి దాదాపు రూ.34.60 లక్షలు లబ్ధిదారుడికి అందజేస్తారు. మూడేళ్ల తర్వాత పాలసీదారుడు రుణ సదుపాయం కూడా ఉంటుంది.

గ్రామప్రియ:
ఈ పథకంలో 10 సంవత్సరాల పాలసీ మాత్రమే నిర్ణయించారు. ఇందులోని 20 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారిని అర్హులుగా చేర్చారు. పథకంలో 10 సంవత్సరాల పాలసీలో మనీబ్యాక్ కింద 4,7 సంవత్సరాలకొకసారి 20 శాతం బోనస్ లభించనుంది. మిగిలిన మొత్తాన్ని పాలసీ ముగిసే సమయంలో బోనస్‌గా అదనంగా జోడించి అందచనున్నారు.

సువిధ:
సువిధ పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పాలసీని సురక్ష పథకంలో మాదిరి 60 సంవత్సరాల వరకూ నిర్ణయించుకోవచ్చు. లేదా సంతోష్ పథకంలో నిబంధనల మేరకు కన్వర్ట్ చేసుకునే అవకాశం కల్పించారు. సురక్ష పథకం కింద ప్రీమియం చెల్లింపులు ఐదేళ్లపాటు చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత సంవత్సరంలోపు సంతోష్ పథకం కింద అయితే రూ.60 బోనస్.. సంతోష్ పథకం కింద కన్వర్ట్ చేసుకుంటే రూ.48 బోనస్‌గా లభిస్తుంది. లబ్ధిదారుడి చెల్లింపులు బట్టి బోనస్‌లు వర్తిస్తాయి.

సుమంగళ్:
ఈ పథకంలో రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో రూ.45లు బోనస్‌గా లభిస్తుంది. పథకంలో రెండు రకాల బోనస్‌లను నిర్ణయించారు. 15 సంవత్సరాల నుంచి పాలసీను ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీబ్యాక్ కింద 6 సంవత్సరాలకొకసారి, 9 సంవత్సరాలకొకసారి, 12 సంవత్సరాలకొకసారి 20 శాతం మనీబ్యాక్ రూపంలో బోనస్ లభించనుంది. అనంతరం మిగిలిన బోనస్‌ను పాలసీ ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీబ్యాక్ కింద 8 సంవత్సరాలు, 12సంవత్సరాలు, 16 సంవత్సరాలకొకసారి 20 శాతం చొప్పున మనీబ్యాక్ రూపంలో బోనస్ లభిస్తుంది. ఈ పథకంలో ఎలాంటి రుణసదుపాయం ఉండదు.

పిల్లల పాలసీ

ఈ పాలసీలో చేరే పిల్లలకు సంబంధించిన తల్లిదండ్రులు, సురక్ష, సువిధ పథకాల్లో లబ్ధి దారులై ఉండాలి. ఆయా పథకాల్లో ఉన్న తల్లిదండ్రుల పిల్లలకు మాత్రమే ఈ పథకం వర్తించనుంది. అది కూడా తల్లిదండ్రుల వయస్సు 45లోపు ఉండాలి. ఈ పథకంలో 5 నుంచి 20 ఏళ్లలోపు ఉన్న పిల్లలకు పాలసీ వర్తిస్తుంది. ఈ పథకంలో రూ.20 వేల నుంచి రూ.1లక్ష వరకూ పాలసీని నిర్ణయించారు. ఈ పథకంలో బోనస్ రూ.48గా నిర్ణయించారు.

ఖైదీ ప్రభాకర్‌ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాల ఏర్పాటు

త్వరలో అరెస్టు చేస్తాం
కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్


దుద్దుకూరు హైవేపై పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్


ఖైదీ ప్రభాకర్ (ఫైల్‌ఫొటో)

దేవరపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లు కప్పి తప్పించుకున్న సెంట్రల్ జైల్ ఖైదీ బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఇందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి ఖైదీ బత్తుల ప్రభాకర్‌ను కేసు విచారణ నిమిత్తం సోమవారం విజయవాడ తీసుకెళ్లి ఎస్కార్ట్‌తో రాజ మహేంద్రవరం వస్తూ రాత్రి దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారి వద్ద ఓ రెస్టారెంట్ వద్ద ఆపారు. దీంతో బత్తుల ప్రభాకర్ మూత్రం వస్తుందని చెప్పగా కుడిచేతికి ఉన్న సంకెళ్లు తొలగించడంతో ప్రభాకర్ పొలాల్లోకి పారిపోయాడు. పోలీసులు వెంబడించినా దొరకలేదు. దీంతో అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీనిపై కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ విలేకర్లతో సమావేశంలో మాట్లాడుతూ వ్యాన్‌లో ముగ్గురు ఖైదీలు ఉన్నారని, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ కోసం ఏపీ, తెలంగాణలో గాలింపు ముమ్మరం చేశామన్నారు. ప్రభాకర్ గతంలో దేవరపల్లి ప్రాంతంలో ఒక స్కూల్ వద్ద రూ.3లక్షలు నగదును చోరీ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో రూ.30 లక్షలు చోరీ కేసులో కూడా నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభాకర్‌ను పట్టుకోవడానికి 15 మంది చొప్పున 3ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డ్రోన్‌తో సాంకేతిక పరిజ్ఞానంతో చెక్ పోస్టుల ద్వారా జాబ్‌కార్డులతోనూ ముమ్మరంగా దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. ఏలూరు ఐజీ అశోక్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలు, సూచనల మేరకు నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. బత్తుల ప్రభాకర్ ఏపీ, తెలంగాణలో 66 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. ప్రభాకర్‌ను త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు.

గూగుల్ క్లౌడ్‌తో 'ఆదిత్య' ఎంవోయూ


ఎంవోయూ కుదుర్చుకున్న గూగుల్ క్లౌడ్, ఆదిత్య ప్రతినిధులు

గండేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుని గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్ (ఎలైట్ టియర్)గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌లోని తొలి యూనివర్సిటీగా నిలిచిందిని ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ భాగస్వామ్యంతో ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా గూగుల్ క్లౌడ్ సర్టిఫికేషన్లు, అకడమిక్ ప్రోగ్రామ్‌లు, అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యక్రమాల్లో భాగం కానుండగా విద్యార్థులకు ఇండస్ట్రీ-లింక్డ్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనా సహకారాలు వంటి అవకాశాలు కల్పిస్తారన్నారు. కార్యక్రమానికి సౌత్ ఇండియా గూగుల్ క్లౌడ్ రీజినల్ హెడ్ సిద్ధార్థ దల్వాడి ముఖ్య అతిథిగా, హెనోటిక్ గ్రూప్ వ్యవస్థాపకుడు సీఈవో బి.మల్లేశం గౌరవ అతిథిగా హాజరయ్యారు. గూగుల్ క్లౌడ్‌కి చెందిన ప్రతినిధి బృందంతో పాటు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్.ఎస్.రమాశ్రీ (ప్రో వైస్ చాన్సలర్ అకడమిక్స్), డాక్టర్ ఎ.రమేష్ (ప్రో వైస్ చాన్సలర్, ఇంజనీరింగ్/సైన్సెస్), డాక్టర్ రవి ధంగజాం (ప్రో వైస్ చాన్సలర్, స్ట్రాటజీ/ పార్టినర్‌షిప్స్), డాక్టర్.జి.సురేష్ (రిజిస్ట్రార్) పాల్గొన్నారు. కార్యక్రమం కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎంరాజాబాబు వ్యవహరించారు.

తప్పుడు సర్టిఫికెట్‌తో డీఎస్సీలో ఉద్యోగం


జయశాంతి (ఫైల్‌ఫొటో)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేటలో నివసిస్తున్న ఆముదాల జయశాంతి తాజా డీఎస్సీ నియామకాల్లో ఉద్యోగం పొందింది. అయితే తప్పుడు ధృవపత్రాలు సమర్పించి ఉద్యోగాన్ని దక్కించుకున్నట్టు తదనంతర విచారణలో వెల్లడైంది. వివరాల్లోకి వెళితే రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయశాంతి తాజాగా డీఎస్సీలో ఉద్యోగానికి అర్హత సాధించింది. ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కోటాలో ఆమె ఉద్యోగం పొందింది. అయితే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తీసుకోవడంలో అవకతవకలకు పాల్పడింది. ఆమెకు వివాహం కాగా భర్త తాతారావు కానిస్టేబుల్ సంపాదనను దాచి తండ్రిని సంరక్షకుడిగా ప్రస్తావిస్తూ తన ఉద్యోగాన్ని మాత్రమే చూపి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందింది. అయితే ఉద్యోగ జాబితాలో ఆ మె తరువాత స్థానంలో ఉన్న అభ్యర్థులు విషయాన్ని తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యాశాఖ ఆమె అందించిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌పై విచారణ చేపట్టింది. అవకతవకలకు పాల్పడినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో ఆమె నుంచి అధికారులు వివరణ తీసుకున్నారు. జయశాంతి చేసిన మోసం తెలిసి ఉద్యోగాన్ని తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పోలీస్‌శాఖ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతోంది.

భార్యపై భర్త హత్యాయత్నం

● కోనసీమ జిల్లా కోటిపల్లిలో ఘటన ● ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కె.గంగవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో భార్యపై హత్యాయత్నం చేసిన భర్తపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీ బాషా చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోటిపల్లి గ్రామానికి చెందిన మొగమాటి అశ్వనికి, రామచంద్రపురానికి చెందిన దత్తవీరవెంకట శివకుమార్‌కు వివాహం అయ్యింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల శివకుమార్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో అశ్విని కోటిపల్లిలో ఉంటుంది. సోమవారం రాత్రి శివకుమార్ దళితవాడలో ఉన్న అశ్విని వద్దకు వచ్చి గొడవ పడ్డాడు. కులం పేరుతో దూషించాడు. అశ్వినిని కడుపులో తన్ని చంపడానికి ప్రయత్నించాడు. ఈ మేరకు అశ్విని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మంగళవారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కె.ప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధిత మహిళ నుంచి వివరాలు సేకరించారు. మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శివకుమార్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

అంతర్వేదిలో నటి కవిత పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి మంగళవారం సినీ నటి కవిత కుటుంబ సమేతంగా విచ్చేసి పూజలు చేశారు. ఆమెకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించారు.


నటి కవితకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

రోడ్డెక్కిన మత్స్యకారులు

● డిమాండ్లను పరిష్కరించాలని ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆందోళన ● రసాయన పరిశ్రమలపై ఆగ్రహం



కాకినాడ జిల్లా ఉప్పాడలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, ఆందోళనకారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

కొత్తపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించి, న్యాయం చేయాలని తీరప్రాంత మత్స్యకారులు మూకుమ్మడిగా రోడ్డెక్కారు. కాకినాడ జిల్లా ఉప్పాడ, అమీనబాద్ గ్రామాలకు చెందిన సుమారు 500 మంది మత్స్యకారులు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆందోళన చేపట్టారు. ఉప్పాడ-కాకినాడ, కాకినాడ-తుని, ఉప్పాడ- పిఠాపురం రోడ్లకు మత్స్యకారులు ఐరన్ టేబుళ్లను అడ్డంగా వేసి రహదారులను నిర్బంధం చేశారు. సాయంత్రం 6 గంటల వరకు ఆందోళన సాగించారు. సముద్ర తీరప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల నుంచి విడుదల చేసిన రసాయనాల కారణంగా మత్స్యసంపద పూర్తిస్థాయిలో నశించిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో సముద్రంలో చేపలు దొరుకుతాయనే నమ్మకంలేదని వాపోయారు. వేట తప్ప మరో ఉపాధి తమకు తెలియదని, రసాయన పరిశ్రమల వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు టుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వేట లేని సమయంలో వేరే ప్రాంతాలకు వెళ్లి వేట చేసేటపుడు అక్కడ మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య పరిశ్రమల కారణంగా జీవనోపాధి కోల్పోయిన ప్రాంతాల్లో మత్స్యకారులకు ఆయా కంపెనీలు నష్టపరిహారం చెల్లించాయని, అదేవిధంగా కూడా తమకు నష్టపరిహారం చెల్లించాలని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉప్పాడ-అమీనబాద్ మినీహార్బర్ నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లు తిరగబడి పలువురు మత్స్యకారులు మృత్యువాత పడ్డారని, హార్బర్ నిర్మాణంలో లోపాలున్నాయని వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల సమస్యలన్నింటిపై కలెక్టర్ లేదా ఎమ్మెల్యే పవన్ కానీ హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించే ప్రసక్తిలేదని వారు హెచ్చరించారు.

కాలుష్య పరిశ్రమలపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు : జేసీ

మత్స్యకారుల ధర్నా వద్దకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా వెళ్లారు. తీర ప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల నుంచి విడుదల చేస్తున్న వ్యర్థజలాల కారణంగా మత్స్యసంపద అంతరించిపోతుందన్న విషయంపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు చేపడతామని మత్స్యకారులకు వివరించారు. అదేవిధంగా ఓఎన్‌జీసీ, ఇతర కంపెనీలు ఆయా ప్రాంతాల్లో నష్టపోయిన మత్స్యకారులకు చెల్లించిన నష్టపరిహారాల నివేదికలను పరిశీలించి తగు చర్యలు చేపడతామని స్పష్టంచేశారు. వేట లేని సమయంలో వేరే ప్రాంతానికి వెళ్లి వేట చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు, మత్స్యశాఖ మంత్రి ఆధ్వర్యంలో 2రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని, స్థానిక మత్స్యకార పెద్దలు హాజరు కావాలని ఆయన కోరారు.

డిప్యూటీ సీఎం రావాల్సిందే..

మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని జేసీ చెప్తుండగా కలెక్టర్ కానీ, డిప్యూటీ సీఎం ఆందోళన దగ్గరకు వచ్చి హామీ ఇస్తేకానీ విరమించేది లేదని మత్స్యకారులు హెచ్చరించారు. పరిస్థితిని గమనించిన కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు ఫోన్‌లో డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయ అధికారులతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం శాసన సభ సమావేశాల్లో ఉన్నారన్న సమాధానం రావడంతో ఆందోళన కారులకు తెలియజేశారు. అందుకు మత్స్యకారులు ససేమిరా అనడంతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకు న్నారు. మత్స్యకార నాయకులను తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిందిగా ఆర్డీవో తెలియ జేశారు. కానీ వారు ఎంతకీ వెళ్లకపోగా డిప్యూటీ సీఎం వస్తేకానీ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేయడంతో కలెక్టర్‌తో అందరూ వెను దిరిగారు. కోనపాపపేటలో కూడా మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. ఉమ్మిడిజాన్, నక్కా మణిం కంఠ, సూరాడరాజు, సూరాడ నాగేశ్వరరావు, మేరుగుభూషణం, ఎల్లాజీ, చోడిపల్లి ప్రసాద్ తదితర మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆందోళనే...

బుధవారం ఉదయం కూడా మత్స్యకారులంతా ఆందోళనలో పాల్గొనాలని మత్స్యకార నాయకులు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం ఉప్పాడ విచ్చేసి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేదిలేదని మత్స్యకార పెద్దలు హెచ్చరించారు. ఒకవేళ డిప్యూటీ సీఎం పవనకల్యాణ్ సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు సమాయత్తం కావాలని సాయంత్రం జరిగిన మత్స్యకారుల సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానించారు.

మారుతీనగర్‌లో విద్యుదాఘాతం

హై ఓల్టేజీతో 40 గృహాల్లో ఏసీ, వాషింగ్ మిషన్లు, మిక్సీలు, ఫ్యాన్లు దగ్ధం



కాలిపోయిన ఏసీ, వాషింగ్ మిషన్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం శివారు మారుతీనగర్‌లో సోమవారం తెల్లవారుజామున హైఓల్టేజీ కారణంగా సుమారు 40 ఇళ్లలో సుమారు రూ.10 లక్షల విలువైన ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్లు, ఫ్యాన్లు, టీవీలు, లైట్లు మాడిపోయాయి. దీంతో మారుతీనగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మారుతీనగర్‌లో సుమారు 250 గృహాలు ఉండగా వారి విద్యుత్తు అవసరాల కోసం స్థానికంగా 60, 40 వోల్ట్సు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్తు శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి పొగలు రావడం, కరెంటు నిలిచి గృహోపకరణాలు హైఓల్టేజీతో దగ్ధం అయ్యాయి. సోమవారం అర్ధరాత్రి హైఓల్టేజీ సంభవించి, విద్యుత్తు సరఫరా నిలిచిపోతే మంగళవారం మధ్యాహ్నం 3 గంటల కూడా విద్యుత్ పునరుద్ధరణ చేయలేని పరిస్థితిలో విద్యుత్తు సిబ్బంది ఉన్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన గృహోపకరణాలను తిమ్మాపురం గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పరిశీలించారు. జరిగిన నష్టాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. హై ఓల్టేజీతో జరిగిన నష్టాన్ని, విద్యుత్ పునరుద్ధరణపై కాకినాడ ఏడీఈ దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్లు భూమికి తక్కువ ఎత్తులో, రక్షణ లేకుండా ఉన్నాయని తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్లిశాలలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు అంశం పరిశీలిస్తాం : మంత్రి భరత్

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నెహ్రూ


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

అమరావతి/జగ్గంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో అందుబాటులో ఉన్న 525 ఎకరాల ప్రభుత్వ భూమిలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తల సమయంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. మల్లిశాల గ్రామంలో ఒకే చోట ఉన్న 525 ఎకరాల భూమిలో గతంలో 42 టైల్స్ ఫ్యాక్టరీలు ఉండేవని, ఇప్పుడు అవన్నీ మూతబడిపోవడంతో వాటిపై ఆధారపడి జీవించే వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ను ఏర్పాటుకు రోడ్డు, రైల్వే, ఎయిర్ కనెక్టివిటీతో పాటు నీటి లభ్యత పుష్కలంగా ఉందని తెలిపారు. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తే మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కోరారు. దీనిపై మంత్రి భరత్ స్పందిస్తూ.. 'ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబ డులు పెట్టేందుకు దుబాయ్ ప్రభుత్వ ప్రతినిధు లకు కొన్ని భూముల చూపించాం. మల్లిశాలలోని 525 ఎకరాల భూమి గురించి కూడా వారి దృష్టికి తీసుకువెళతాం. వారు కాదంటే ఏపీఐ ఐసీ ద్వారా ఏవిధంగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయొచ్చనే దానిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేర కు రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలతో ముందుకువెళ్తున్నాం. ఇప్పటికే పలు పార్కులు ప్రారంభించాం. మరికొన్నింటికి శంకుస్థాపన చేశాం. త్వరలో మరో 30 పార్కులను ప్రారంభించనున్నాం' అని పేర్కొన్నారు.

ఒమ్మంగి సొసైటీకి జరిమానా

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి కలెక్టర్ షాన్‌మోహన్ రూ.25వేలు పెనాల్టీ విధించారు. ఒమ్మంగి పీఏసీఎస్ యూరియా ఎరువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడటంపై కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నారు. ఈ ఆదేశాలు మంగళవారం ఒమ్మంగి పీఏసీఎస్‌కు అందజేసినట్టు మండల వ్యవసాయాధికారి జోకా అమృత తెలిపారు.

కారులో గంజాయి రవాణా

జగ్గంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం టోల్ ప్లాజా వద్ద మంగళవారం ఆర్‌జే60 యూఏ 4616 నెంబరుగల ఇన్నోవా కారులో గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వారు కారును పట్టుకోవడానికి యత్నించగా కృష్ణవరం టోల్‌ప్లాజాను దాటి అడ్డదారిన పెద్దాపురం మండలం దివిలి గ్రామం వెళ్లి సుమారు 200 కిలోల గంజాయి బస్తాలను వదిలేసి కారు సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం వైపు వెళ్లినట్టు తెలిసింది.

వివాహిత అదృశ్యంపై కేసు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గత కొంత కాలంగా విబేధాలు ఉన్న నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి భార్య కనిపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అమలాపురంపట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన ఉప్పే లక్ష్మణ్‌తో విజయకుమారి (29)కి వివాహం జరిగింది. వారి మధ్య విబేధాల నేపథ్యంలో గత 5 నెలలుగా భార్య విజయకుమారి విడిగా ఉంటుంది. అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లోని ఒక అపార్టుమెంట్‌లో అక్క వద్ద ఉంటున్న విజయకుమారి తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం అన్నిచోట్లా గాలించినా ప్రయోజనం లేకపోవడంతో భర్త లక్ష్మణ్ అమలాపురం పట్టణ పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

50 సీసాలు స్వాధీనం

ఎటపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని ఓ బడ్డీ దుకాణంలో బెల్ట్ షాపు నిర్వహిస్తూ అమ్మకాలు చేస్తుండగా మంగళవారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడి చేశారు. 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేశారు. ఈక్రమంలో నెల్లిపాక మద్యం దుకాణం నుంచి ఆయా గ్రామాల బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్న వారి నుంచి సుమారు 95 బాటిళ్ల మద్యంసీసాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నలుగురి ఎంపిక



డి.సతీష్

అనపర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-19 పోటీలకు మండలం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గొల్లల మామిడాడలో నిర్వహించిన ఎంపికల్లో అనపర్తి కొత్తూరులోని అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థి డి.సతీష్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎం.రాజు తెలిపారు. ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల నుంచి అండర్-19 విభాగంలో బాల్ బ్యాడ్మింటన్‌కు నల్లమిల్లి దొర వెంకటకృష్ణారెడ్డి, కె.రాజు, వాలీబాల్ విభాగంలో కె.శ్రీనివాసకుమార్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తాడి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

గౌరిదేవి ఉత్సవాలకు శ్రీకారం

బిక్కవోలు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వెలమల ఆరాధ్య దైవమైన గౌరీదేవి ఉత్సవాలకు ఊలపల్లిలో మంగళవారం శ్రీకారం చుట్టారు. రెండేళ్ల కొకసారి గ్రామంలోని వెలమలు రెండు వర్గాలుగా విడిపోయి చినగౌరమ్మ, పెద్ద గౌరమ్మ పేరిట ఒకే రోజు ఉత్సవాలను పోటాపోటీగా నిర్వహిస్తారు. మంగళవారం చిన్నగౌరమ్మ విగ్రహ తయారీకి చెక్కను మేళతాళాల నడుమ భక్తులు గ్రామంలో వడ్రంగికి అందజేశారు. 15రోజుల్లో తయారైన అమ్మవారి విగ్రహాన్ని లక్ష్మీగణపతి ఆలయంలో ఉంచి 25 రోజుల పాటు ప్రత్యేక పూజలు జరిపి అనంతరం ఉత్సవం జరుపుతారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గాయిత్రిదేవి అవతారంలో కనకదుర్గమ్మ



గోకవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులు సందర్భంగా రెండో రోజైన మంగళవారం గోకవరంలోని వీరభద్రుని గద్దెలో కనకదుర్గమ్మ.. గాయిత్రిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుఝాము నుంచి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణశర్మ భక్తుల గోత్రనామాలతో కుంకుమ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

పార్వతి దేవిగా శ్రీరాజరాజేశ్వరి

బిక్కవోలు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం గ్రామంలోని జువ్వలదొడ్డిలో ఉన్న శ్రీరాజరాజేశ్వరి పీఠంలో అమ్మవారు పార్వతి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ అవతారంలో అమ్మవారిని పూజించడం వల్ల ఆయురారోగ్యములతో సుఖంగా వుంటారని దైవజ్ఞ దేవరభోట్ల ప్రభాకరశర్మ తెలిపారు.

శ్రీదేవి అమ్మవారికి 95 కిలోల లడ్డూ



కడియం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కడియం దేవీచౌక్ సెంటర్లో భక్తుల పూజలందుకుంటున్న శ్రీదేవి అమ్మవారికి స్థానిక భక్తాంజనేయ స్వీట్స్ వ్యాపారి నేతి నానాజీ సోదరులు 95 కిలోల లడ్డూను స్వయంగా తయారు చేసి అందజేశారు. కడియం సొసైటీ ఛైర్మన్ వెలుగుబంటి రఘురామ్(నాని), ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు గ్రంధి నాగులతో కలిసి మంగళవారం నానాజీ సోదరులు లడ్డూను ఆలయ కమిటీకి అందజేశారు.నాలుగేళ్లుగా దసరా ఉత్సవాల్లో అమ్మవారికి లడ్డూ అందజేస్తున్న నానాజీ సోదరులను నానితో పాటు ఆలయకమిటీ అభినందించింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

నిరంతర ప్రవాహశీలంగా సాంకేతిక అభివృద్ధి

ఏపీ ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం నిరంతర ప్రవాహశీలంగా అభివృద్ధి చెందుతోందని ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ జి.కిరణ్‌కుమార్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఈసిఈ విభాగం ఆధ్వర్యంలో ఏఐ సహాయంతో కూడిన స్మార్ట్ రేడియో వైర్‌లెస్ 5జీ, అంతకు మించి నెట్‌వర్క్‌ల అభివృద్ధి అనే అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి రీసోర్స్‌పర్సన్‌గా హాజరైన కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేటి సాంకేతికతపై విద్యార్థులు పట్టు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ప్రాథమిక రేడియో సాంకేతికత నుంచి నేటి కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం వరకూ విప్లవాత్మక మార్పులు జరిగాయని అన్నారు. ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నెట్వర్క్ పరిణామక్రమం, నెట్వర్క్‌లోని సమస్యలను అధిగమించే విధానాలు, వేగవంతంగా డేటాను బదిలీ చేయడానికి నెట్ వర్క్ పాత్ర ఏవిధంగా ఉంటుందనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ పి.వెంకటరత్నం, బి.సుధాకిరణ్, ఎ.విజయదుర్గ, బి.కృష్ణ, ఎస్.సంతోషి, విద్యార్థులు పాల్గొన్నారు.

మ్యూజిక్ లైబ్రరీ డిజిటలైజేషన్‌కు క్యాసెట్లు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గోదావరి గట్టున శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవా సమితిలో 1960 నుంచి జరిగిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన 30వేల ఆడియో క్యాసెట్లను డిజిటలైజేషన్ చేసి చక్కటి మ్యూజిక్ లైబ్రరీ తయారు చేసేందుకు మంగళవారం అంకురార్పణ జరిగింది. సేవా సమితి ప్రిన్సిపల్ సెక్రటరీ మద్దూరి శివానందకుమార్ పేరుతో ఏర్పాటు చేసే ఆడియో లైబ్రరీకి ఆడియో క్యాసెట్లను సాగి శ్రీరామచంద్రమూర్తికి డిజిటలైజేషన్ చేసేందుకు అప్పగించారు. కార్యక్రమంలో మద్దూరి సుబ్బారావు, విశ్వనాథం భాస్కరరామ్, వక్కలంక రామం, పీవీఎస్ కృష్ణారావు, మద్దూరి శివరామ శశిభూషణ్, అనిల్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కడియం రైల్వే స్టేషను సమీపంలో రైలు నుంచి మంగళవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి చనిపోయాడని రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వాళ్లు 99597 63463 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

బిక్కవోలు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొంకుదురులో అయ్యప్పస్వామి ఆలయాభివృద్ధికి గ్రామానికి చెందిన కర్రి సూర్రెడ్డి రూ.50 వేల విరాళాన్ని మంగళవారం గురుస్వాములు వెలగల చెల్లారెడ్డి, కర్రి సత్యనారాయణరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డిలకు అందజేశారు.ఈ సొమ్మును ఆలయంలో సపటా,గేట్లు నిర్మాణానికి వినియోగిస్తామని తెలిపారు.

ఒక్కో రైతుకు రూ.15 లక్షల రుణం

దోసకాయలపల్లి సొసైటీ మహాజన సభలో ఛైర్మన్ గంగాధర్



కూటమి అగ్రనేతల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కోరుకొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా ఒక్కో రైతుకు ఎకరానికి రూ.8 లక్షలు చొప్పున రూ.15 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నామని ఛైర్మన్ గంగాధర్ పేర్కొన్నారు. మండలంలోని దోసకాయలపల్లి సొసైటీలో రైతు మహాజన సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో కొయిడాల అప్పలరాజు సొసైటీ నివేదికను వివరించారు. సొసైటీలో 562 మంది సభ్యులుగా ఉన్నారని వారి వాటా ధనం రూ.1,34,74,000 ఉందన్నారు. టర్నోవర్ రూ.13.83 కోట్లు అని అన్నారు. ఇటీవల 15మంది రైతులకు కొత్తగా రూ.83,3 3,000 రుణాలు అందజేశామన్నారు. 64 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేశామన్నారు. 2023-24లో సక్రమంగా రుణాలు చెల్లించిన 191 మంది రైతులకు 3శాతం వడ్డీ రాయితో రూ.2,97,000 అందజేశామన్నారు. ప్రస్తుతం వరి రైతులకు యూరియా అందజేశామని, పండ్ల తోటలకు కూడా ఇవ్వాలని కోరుతున్నారని స్టాక్ వచ్చిన వెంటనే అందజేస్తామన్నారు.ఇదిలా ఉండగా ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినందుకు, యూరియాను సబ్సిడీపై సకాలంలో అందజేసినందుకు రైతులు.. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ,రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణలతో ఉన్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకుడు మార్ని రాము, సొసైటీ డైరెక్టర్లు కర్రి రాజారావు, గల్లా శ్రీనివాసరావు, స్టాఫ్ అసిస్టెంట్ కాకర సత్యనారాయణ మూర్తి, రైతులు మార్ని మధుసూదనరావు, అగ్రపు ఆదినారాయణ, సూదిన సుబ్బారావు, సర్పంచ్ తారా రాంబాబు, పచ్చిపాల సూర్యారావు, రాము, మల్లిన వీరభాస్కర చౌదరి పాల్గొన్నారు.

దుర్గాదేవిని దర్శించుకున్న కోరుకొండ సీఐ సత్యకిషోర్

కోరుకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాపవరంలో మంగళవారం కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ దంపతులు కుటుంబ సమేతంగా దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ధర్మకర్త నీరుకొండ వర్దన విజయభాస్కరరావు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో అమ్మవారి శేషమాల, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు బదిరెడ్డి దొర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

రంగంపేట వైద్యాధికారిణి వేణుశ్రీలక్ష్మి
పలుచోట్ల 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్'

రంగంపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని రంగంపేట వైద్యాధికారిణి వేణుశ్రీలక్ష్మి అన్నారు.స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కోటపాడు, మర్రిపూడి గ్రామాల్లో వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మీ, కె.చిన్నారావు, కె.సంకీర్తన ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. కోటపాడులో 305 మందికి, మర్రిపూడిలో 233 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మోదుకూరి సత్తిరాజు, పుట్టా సోమన్న చౌదరి, పుట్టా వెంకటేష్, దువ్వా సూరిబాబు, ఆచంట వెంకటేశ్వర్లు, బత్తుల వీరబాబు, సింగన సత్తిబాబు, సర్పంచ్ గవరసాని లక్ష్మీ పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక, బిక్కవోలు గ్రామాల్లో నిర్వహించిన ఆరోగ్య శిబిరాల్లో 206 మంది మహిళలకు వైద్య పరీక్షలు జరిపారు. కొంకుదురు పీహెచ్‌సీ పరిధిలోని పందలపాక గ్రామంలో వైద్యురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో 110 మంది మహిళలకు వివిధ వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. సర్పంచ్ సబ్బారపు పద్మావతి, సొసైటి ఛైర్మన్ పడాల సూర్యనారాయణరెడ్డి, నాయకులు గుణ్ణం శ్రీనివాసచౌదరి, పడాల చిన బుజ్జి, బోగాది వెంకటరమణ, యామాల చిన్నమ్మ పాల్గొన్నారు. బిక్కవోలు అంబటిపేటలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ దుర్గాదేవి 106 మంది మహిళలకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనపర్తి: రామవరంలోని మూలారెడ్డి సత్యవతి నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ గిరిడా గంగాభవాని ప్రారంభించగా డాక్టర్ మీనాక్షి 116 మందికి పరీక్షలు జరిపి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ డీసీ ఛైర్మన్ మల్లిడి జీవన్‌రెడ్డి, నాయకులు తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత కీలకం

ఎన్ఎస్ఎస్ రాష్ట్రాధికారి సుధాకర్



డాక్టర్ సుధాకర్‌ను సత్కరిస్తున్న జీఎస్ఎల్ అధ్యాపకులు

రాజానగరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలక భూమిక పోషిస్తుందని రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ అన్నారు.రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ విద్యాసంస్థల్లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సుధాకర్ మాట్లాడుతూ దేశభక్తి, పౌర స్పృహ, బాధ్యతాయుతమైన ప్రవర్తన, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి ఎన్ఎస్ఎస్ ఒక అద్భుతమైన వేదిక అని, విద్యార్థులు సమాజ సేవలో పాల్గొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనను జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సి పాల్ డాక్టర్ గురునాథ్ ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హరి కృష్ణంరాజు, మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ కె.వాణి మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దినోత్సవానికి రాష్ట్రాధికారి ఎం.సుధాకర్ విచ్చేసి మాట్లాడారు. తాను ఎన్ఎస్ఎస్‌లో భాగంగా చేసిన కార్యక్రమాలను వివరించారు. ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. కళాశాల ఇన్‌చార్జి డీవీఎస్ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ యాకూబ్, జే.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు 60 ఎంబీఏ సీట్లు: ఎమ్మెల్యే వాసు



మంత్రి లోకేశ్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక ఆర్ట్స్ కళాశాల 60 ఎంబీఏ సీట్లు సాధించినట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ సీట్లు విషయాన్ని ఆర్ట్స్ కళాశాల యాజమాన్యం గతంలో తన దృష్టికి తీసుకువచ్చిందని, దానిని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఉన్నత విద్య విభాగం అధికారులతో మాట్లాడి ఆర్ట్స్ కళాశాలలో ఎంబీఏకు 60 సీట్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఎంబీఏ కోర్సును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్న మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.గతంలో అల్లు రామలింగయ్య హోమియో కళాశాలలో మరుగునపడిపోయిన 26పీజీ సీట్లను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరించామని ఎమ్మెల్యే వాసు గుర్తుచేశారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువస్తూ ప్రగతి పథంలో రాష్ట్రాంలో విద్య పటిష్ఠం చేయ్యడంలో మంత్రి నారా లోకేష్ చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆదిరెడ్డి వాసు చెప్పారు.

మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం

రాజమహేంద్రవరంలో ఈ నెల 28 వరకు జరుగనున్న యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్- 2025 పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే వాసు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను ఆయన చాంబర్‌లో కలిసి ఆహ్వానపత్రాన్ని అందించారు.

బేడ, బుడ్గ జంగాల సమస్యలు పరిష్కరించండి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బేడ, బుడ్గ జంగాల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి బేడ బుడ్గ జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వీర్లపల్లి ఏసు వినతిపత్రం అందించారు. రాజమహేంద్రరంలో ఎంపీని కలిసి తమ సమస్యలను వివరించారు. పిల్లల చదువుల విషయంలో ఎదురౌతున్న సమస్యలు విన్న ఎంపి తప్పక దీనిపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీర్నాల కృష్ణ, బీజేపీ నాయకులు తగరం సురేష్‌బాబు, వెంకటరమణ, బేడ, బుడగ జంగాల మహిళలు పాల్గొన్నారు.

పీ4పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ/బిక్కవోలు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4(పబ్లిక్, ప్రవేట్, పీపుల్ పార్టనర్ షిప్) కార్యక్రమం అమలులో సచివాయల ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్ అన్నారు. పీ4 అమలుపై సచివాలయ ఉద్యోగులకు రాజమహేంద్రవరం కళాకేంద్రంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విజన్-2047 లక్ష్యాల్లో భాగంగా పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. అలాగే మొబైల్ యాప్‌లో బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయడం, యాప్‌లో ఆప్షన్ అప్డేట్ చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో కార్పొరేషన్ సెక్రటరీ జిశైలజవల్లి, ఏఎస్‌వోకే ప్రసాద్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఏఎస్‌వీ హరికృష్ణ, యంగ్ ప్రొఫెషనల్ కె.దుర్గాభవాని పాల్గొన్నారు. బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి వీఎన్ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు మాస్టర్ ట్రైనీలుగా డి.శ్రీనివాస్, కె.సాయిఅరవిందరెడ్డి, ఎన్.సురేష్ వ్యవహరించారు. డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

రాజానగరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ మండలంలోని సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏపీ సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మంగళవారం నుంచి సచివాలయ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల జిల్లా ఛైర్మన్ వరసాల రామదాసు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను మాతృశాఖకు పంపించాలని, జూనియర్ అసిస్టెంట్ స్కేల్ అమలు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. అలాగే సెలవు రోజుల్లో బలవంతపు పనులు అప్పగించరాదని, ఇంటింటికీ సర్వే పేరుతో ఉద్యోగులపై వేధింపులను నిలిపివేయాలని నినదించారు.



అమ్మా.. కోట సత్తెమ్మ

నిడదవోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోటసత్తెమ్మ ఆలయంలో మంగళవారం రెండో రోజు దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంత్రం హోమం చేశారు. సుమారు 224 మంది భక్తులు అమ్మవారి ప్రత్యేక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు.

రోడ్డు గోతిలో పడి..ఇళ్లలోకి దూసుకుపోయిన బస్

- ప్రమాదంలో ఒకరి మృతి
- ప్రయాణికులంతా క్షేమం

పెరవలి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రోడ్డు గోతిలో పడి ఆర్టీసీ బస్ స్టీరింగ్ ఒక్కసారిగా తిరగడంతో ప్రమాదం జరిగింది.. తణుకు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ఆర్‌టీసీ బస్సు మంగళవారం నిడదవోలు - నరసాపురం రహదారిపై తీపర్రు వద్ద అదుపుతప్పి ఇళ్ళపైకి దూసుకుపోయింది. రోడ్డుపై గోతులు ఉండటంతో గోతులో పడిన ఆర్‌టీసీ బస్సు స్టీరింగ్ వదిలి వేయడంతో కుడివైపు ఇళ్లపైకి దూసుకుపోయినట్టు డ్రైవర్ పోలీసులకు తెలిపాడు. ఈ ప్రమాదంలో పెరవలి వైపు మోటారు సైకిల్‌పై వస్తున్న కడింపాడుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సలాది సత్యనారాయణ (అన్నవరం) (50) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని తీపర్రుకు చెందిన జనసేన నాయకుడు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ కారులో తణుకు ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించాడు. అయితే చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. బస్సు నిండుగా ప్రయాణికులు ఉన్నప్పటికి వారికి ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.



మృతుడు సత్యనారాయణ



ఇళ్లలోకి దూసుకుపోయిన బస్సు..



కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్‌పై కేంద్ర మంత్రితో మాట్లాడా..

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

దేవరపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, భద్రాచలం రైల్వే లైన్ విషయంలో కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడడం జరిగిందని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం దేవరపల్లి పల్లపువీధి రామాలయం, మూడు బొమ్మల సెంటర్ వద్ద అమ్మ వార్లను మంగళవారం దర్శించుకున్నారు. ప్రధాని మోదీ అన్ని వర్గాల ప్రజలకు జీఎస్టీని అందుబాటులోకి తెచ్చారన్నారు. దసరా పండుగను అదరూ సంతోషంగా గడుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ గూడ్స్‌పై ధరలు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు ముద్రగడ క్రాంతి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు ఆంధ్రా అనీల్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దేవంలో మరో గేదె మృతి

తాళ్లపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేవం గ్రామంలో వ్యాధి సోకిన మరో గేదె మంగళవారం మృతిచెందింది. జమ్ముల శ్రీనివాస్ గేదె రెండు రోజుల కిందట మృతి చెందగా..గెద్దం మణికంఠకు చెందిన గేదె మంగళవారం మృతి చెందింది. రాష్ట్ర, జిల్లా వైద్యాధికారులు ఎంత ప్రయత్నం చేసినా వ్యాధి సోకిన గేదెలకు మృతి తప్పలేదు. మొత్తానికి గ్రామంలో చనిపోయిన గేదెలు 33కు చేరాయి. రైతులు మాట్లాడుతూ నాయకులు స్పందించి తమకు కొంత నష్ట పరిహారం అందిస్తే కొంత రుణాలు తీసుకుని గేదెలను కొనుగోలు చేసుకుంటామంటున్నారు.



సాగుకు.. సౌరభం!

వ్యవసాయానికి సోలార్ విద్యుత్

- రైతులకు తీరనున్న సమస్య
- పగలు 9 గంటలు సరఫరా
- రెండు జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటు
- రూ.162 కోట్లతో 12 ప్రాజెక్టులు
- ఏడాదిలోపు పూర్తికి ఒప్పందం
- ఉత్పత్తయ్యే విద్యుత్ గ్రిడ్‌కు..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగుకు సోలార్ విద్యుత్ రాబోతోంది. ఇకపై పగటిపూటే తొమ్మిది గంటలపాటు విద్యుత్‌ను అన్నదాతలు వినియోగించుకోవచ్చు. తద్వారా వ్యవసాయానికి విద్యుత్ బెంగ తీరబోతోంది. ఈ మేరకు ట్రాన్స్‌కో రూ.162 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించడానికి అడుగులు వేసింది. దీని ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కేవలం పగటి పూట రైతులు వాడుకునేందుకు మాత్రమే సరఫరా చేయనుంది. తద్వారా రైతులు విద్యుత్ కోసం రాత్రి వేళల్లో పడిగాపులు కాసే పరిస్థితులు తప్పనున్నాయి. కాకినాడ జిల్లాలో పోలవరం కాలువ వెంబడి మురారీ నుంచి తేటగుంట వరకు 11 చోట్ల, రాజమహేంద్రవరం జేగురుపాడులో 30 ఎకరాల్లో మరోచోట ఈ భారీ సోలార్ పవర్ ప్లాంట్లు రాబోతున్నాయి. పీఎం కుసుమ్ కింద వీటి నిర్మాణ పనులను తాజాగా పేరాడిమ్ టెక్నాలజీ, నోవల్ లాజిటెక్ సంస్థలు దక్కించుకున్నాయి. ఏడాదిలోగా ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయనున్నాయి. కాకినాడ జిల్లాలో 11 ప్రాజెక్టులకు రూ.150 కోట్లు, జేగురుపాడు సోలార్ ప్లాంట్‌కు రూ.12 కోట్లు ఖర్చుకానుంది. సోలార్ పవర్ ప్లాంట్లను దక్కించుకున్న సంస్థలు ఇటీవల స్థల పరిశీలన పూర్తి చేశాయి.

ఇక బెంగ తీరినట్లే...

వ్యవసాయాధారిత జిల్లా ఉమ్మడి తూర్పుగోదావరి. వరి, వాణిజ్య పంటల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే మంచి ప్రగతి సాధిస్తున్నారు. అయితే వీరిలో విద్యుత్ మోటార్లపై ఆధారపడి సాగు చేస్తోన్న వారి సంఖ్య అధికమే. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 70 వేల వరకు ఉన్నాయి. వీటిలో సాగుకు పక్కాగా తరచూ విద్యుత్ వినియోగిస్తోన్న కనెక్షన్లు 51 వేలు ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తోంది. 49 వేల మంది రైతులు వినియోగించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు 3.10 లక్షల కిలోవాట్స్ లోడ్ అవసరం అవుతోంది. అంటే 500 మిలియన్ యూనిట్లపైనే. ఈ మొత్తం విద్యుత్‌ను అన్నదాతలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందుకు ఏటా రూ.300 కోట్ల వరకు ఆర్థిక భారం పడుతోంది. లోడ్ అంతరాయాలు లేకుండా ఇప్పటికే మూడు ఈహెచ్‌టీ విద్యుత్ ఉప కేంద్రాల్లో రూ.148 కోట్లతో 33 కేవీ ఫీడర్లు ఏర్పాటు చేశారు. ఇందులో రూ.38.41 కోట్లతో 25 పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచారు. మరో 19 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. ఇంత చేసినా తీవ్ర వేసవి సమయంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం కష్టం అవుతోంది. దీంతో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కోతలు విధించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో అత్యవసర సమయంలో నీరందరక పంటలు ఎండి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై సాగుకు విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకూడదనే లక్ష్యంలో భాగంగా పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద ట్రాన్స్‌కో అధికారులు సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించారు.

సోలార్ ప్లాంట్లు ఏర్పాటు

పీఎం కుసుం పథకం కింద పగటి పూట తొమ్మిది గంటలు సోలార్ విద్యుత్ సరఫరా చేయడానికి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 12 చోట్ల సోలార్ పవర్‌ప్లాంట్లను నిర్మించాలని నిర్ణయించారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక ఉత్పత్తయ్యే విద్యుత్‌కు గ్రిడ్‌ను అనుసంధానించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కు మాత్రమే సరఫరా చేయనున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో రూ.150 కోట్లతో 11 చోట్ల వీటిని నిర్మించనున్నారు. స్థల సమస్య ఉండడంతో పోలవరం కాలువ వెంబడి నిర్మిస్తున్నారు. జగ్గంపేట నియోజవర్గం గండేపల్లి మండలం మురారీ నుంచి తుని నియోజకవర్గం తేటగుంట వరకు కాలువ వెంబడి సోలార్ పవర్ ప్లాంట్లు రానున్నాయి. గండేపల్లి మండలం బొర్రంపాలెంలో 16 ఎకరాల్లో, ఉప్పలపాడులో 11, గండేపల్లిలో 23, మురారి 8, నాయంకపల్లి 10.40 ఎకరాలు, జగ్గంపేటలో 25.73, ప్రత్తిపాడులో 16, అన్నవరం 17.36, కత్తిపూడి 11.49, తుని రూరల్ తేటగుంటలో 1.79, తుని చామరవరంలో 24.07 ఎకరాల్లో మొత్తం 173.65 ఎకరాల్లో సోలార్ పవర్‌ప్లాంట్లు రాబోతున్నాయి. మొత్తం కాలువ వెంబడి స్థలాల్లో ఐదు నుంచి పదెకరాల వరకు ఉన్న చోట్ల 8 మెగావాట్ల వరకు, తక్కువ స్థలం ఉన్నచోట్ల రెండు నుంచి నాలుగు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ప్లాంట్లను స్థాపించనున్నారు. మొత్తం అన్నీ కలిపి 173.65 ఎకరాల్లో 40 మెగావాట్ల సామర్థ్యంతో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇవి రాబోతున్నాయి.

కోనసీమలో మాత్రం..

వీటికి ఇటీవల టెండర్లు పిలిచారు. కాకినాడ జిల్లాలో ప్లాంట్ల నిర్మాణ పనులను పేరాడిమ్ టెక్నాలజీ సంస్థ దక్కించుకోగా, తాజాగా కంపెనీ ప్రతినిధులు అన్ని స్థలాలను పరిశీలించి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజ మహేంద్రవరం సమీపంలోని జేగురుపాడులో 30 ఎకరాలు గుర్తించారు. ఇక్కడ 9.5 మెగా వాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించనున్నారు. ఈ పనులను నోవల్‌లాజిటెక్ సంస్థ దక్కించుకుంది. ఇందుకు రూ.12 కోట్ల వరకు ఖర్చు కానుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండుచోట్ల సోలార్ ప్లాంట్లను నిర్మించడానికి ప్రయత్నించినా స్థల సమస్యతోపాటు ఎక్కడికక్కడ చెట్లు అడ్డు తగులుతుండడంతో సోలార్ విద్యుత్‌కు సరిపడా ఎండ లభించదనే నిర్ణయానికి ప్రస్తుతం వచ్చారు.

అధ్యక్షా!



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రైవేటీకరణ.. పీపీపీకి తేడా తెలియని వైసీపీ

అసెంబ్లీలో ఎమ్మెల్యే వాసు

రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు 4వ రోజు మన జిల్లా ఎమ్మెల్యేలు తమ వాణి వినిపించారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి వాసు పలు సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు.

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలల విషయంలో ప్రైవేటీకరణకు, పీపీపీకి మధ్య తేడా తెలియక వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. పీపీపీ విధానం ఏదో మన రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా చేస్తున్నట్టు వారు మాట్లాడుతున్నారు కానీ ఇప్పటికే కస్తూరిబా మెడికల్ కళాశాల (బెంగళూరు) పీపీపీ మోడ్‌లో నడుస్తుందన్నారు. శాంతి నికేతన్ మెడికల్ కళాశాల (పశ్చిమబెంగాల్) పీపీపీ మోడ్‌లో నడుస్తోందని, త్రిపుర మెడికల్ కళాశాల త్రిపుర , కర్ణాటకలో 11 మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించి అతి త్వరలో ప్రారంభించనున్నారన్నారు. రాజమహేంద్రవరంలోని మెడికల్ కళాశాలకు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో రెండేళ్లలో ఖర్చుచేసింది కేవలం రూ.10 కోట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ 15 నెలల్లో ఖర్చుచేసింది రూ.32 కోట్లు అన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మరుగునపడిపోయిన రాజమండ్రి అల్లురామలింగయ్య హోమియో కళాశాలకు చెందిన 23 సీట్లు మంత్రి సత్యయాదవ్‌తో మాట్లాడి సాధించుకోగలిగామని గుర్తుచేశారు. రాజమహేంద్రవరం ప్రభుతాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అవసరం ఉందని సభ దృష్టికి తీసుకెళ్లారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి వైసీపీ వాళ్ల జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.వైసీపీ వాళ్ల రాష్ట్రానికి ప్రజలకు చెడుమాత్రం చేయవద్దన్నారు.

ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలి : ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. డివిజన్ కేంద్రమైన కొవ్వూరులో 50 పడకల ఆసుపత్రి ఉందని.. అయితే జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో అత్యవసర కేసులు ఎక్కువగా వస్తున్నాయన్నారు.ఇటీవల ఐదేళ్లు ఐదేళ్లు పూర్తయిందని వైద్యులు, వైద్య సిబ్బందిని బదిలీ చేశారన్నారు.బదిలీ అయిన వారి స్థానంలో కొత్త వారిని నియమించలేదన్నారు.కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లోని పీహెచ్‌సీలలో సిబ్బంది కొరత అధికంగా ఉండడంతో సకాలంలో వైద్యం అందడం లేదన్నారు. వైద్యులు,వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

వైసీపీలో కొన్న భూములపై విచారణ చేయాలి

మండలిలో ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలకు సేకరించిన భూముల రేట్లపై అనుమానాలు ఉన్నాయని, ఎన్ని ఎకరాలు ఎంత ధర పెట్టి కొన్నారు అనే అంశాలపై విచారణ చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. శాసన మండలిలో మంగళవారం ఈ విషయాలను ప్రస్తావించారు. అపరిష్కృతంగా మిగిలిన టిడ్కో ఇళ్లపై త్వరగా ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, అయినా దీనిపై రాజకీయ రాద్ధాంతానికి తెరలేపారన్నారు. నష్టాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

రేపటి నుంచి జీఎస్టీ సదస్సులు

అక్టోబరు 19న బాణాసంచాలతో సెలబ్రేషన్స్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ 2.0 విధానంతో పలు రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. కానీ మార్కెట్‌లో పాత సరుకు ఉందనే కారణంతో చాలా వస్తువుల ధరలు తగ్గించలేదు. సుమారు 15 రోజుల్లో కొత్త సరుకు రావొచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కేవలం కార్లు, ఏసీలు, టీవీలు వంటి ధరలు మాత్రమే కొద్దిగా తగ్గినట్టు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ దుకాణం వద్ద సరుకు పాత ధర.. జీఎస్టీ తగ్గిన తర్వాత అమల్లోకి వచ్చిన ధరల వివరాలతో బోర్డులు పెట్టాలి. కానీ ఇంకా ఎవరూ పెట్టలేదు. పైగా ప్రజలకు అవగాహన లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీఎస్టీ 2.0 విధానంపై పెద్దఎత్తున ప్రచారం చేయనుంది. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకూ అవగాహన సదస్సులు జరుగనున్నాయి.25 నుంచి 29వ తేదీ వరకూ నిత్యావసరాలు, గృహస్తులకు ఎంత సేవింగ్ అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నారు. ఈ నెల 30 నుంచి అక్టోబరు 6వరకూ వ్యవసాయం ఇతర వృత్తులకు సంబంధించిన వాటిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. అక్టోబరు 7 నుంచి 13 వరకూ హెచ్‌ఆర్‌డీ, టెక్నాలజీ, డిజిటల్ ఎంపవర్‌మెంట్ అంశాలపై అవగాహన కలిగిస్తారు. అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకూ డెవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్, వెల్త్ క్రియేషన్, వికాస్ విశ్వాస్ పేరుతో సదస్సులు నిర్వహిస్తారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సదస్సుల్లో పాల్గొనాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ 27వ తేదీ వరకూ ఉంటుంది. అనంతరం జిల్లా స్థాయి మీటింగ్‌లో ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. 19వ తేదీన బాణసంచా కాల్పులతో సెలబ్రేషన్ ఆఫ్ సేవింగ్స్ పేరిట జీఎస్టీ 2.0 పండగ నిర్వహించనున్నారు.అన్ని స్థాయిల్లోని సుమారు 58 శాఖల అధికారులు భాగస్వాములు కానున్నారు.

బాల్య వివాహాలు చేయవద్దు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 23 (ఆం ధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ స్పష్టం చేశారు. ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయంలో మం గళవారం సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణ, న్యాయ పరమైన అంశాలపై ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.బాల్య వివాహాల వల్ల సమాజానికి కలిగే హాని, చట్టపరంగా విధించే శిక్షలపై వివరించారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, వాడకం, సర ఫరా, నిల్వ వంటివన్నీ క్రిమినల్ నేరాల పరిధి లోకి వస్తాయన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడిన వాళ్లు వాటి నుంచి బయటపడి న్యా యపరమైన జీవితం సాగించ డానికి స్వచ్ఛం దంగా సహాయం కోరితే వాళ్లపై ఎలాంటి కేసులు ఉండవని,నేర విచారణ ఉండదని చెప్పారు.ఉచిత వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. నల్సా వారి మాదక ద్రవ్యాల బాధితులకు న్యాయ సేవలు, మాదకద్ర వ్యాల నిషేధ పథకం-2025 కింద అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

ఖైదీ ప్రభాకర్‌ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు

త్వరలో అరెస్టు చేస్తాం

కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్



దుద్దుకూరు హైవేపై పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్



ఖైదీ ప్రభాకర్ (ఫైల్‌ఫొటో)

దేవరపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్ల కప్పి తప్పించుకున్న సెంట్రల్ జైల్ ఖైదీ బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఇందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి ఖైదీ బత్తుల ప్రభాకర్‌ను కేసు విచారణ నిమిత్తం సోమవారం విజయవాడ తీసుకెళ్లి ఎస్కార్ట్‌తో రాజమహేంద్రవరం వస్తూ రాత్రి దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారిలో ఓ రెస్టారెంట్ వద్ద ఆపారు.బత్తుల ప్రభాకర్ మూత్రం వస్తుందని చెప్పగా కుడిచేతికి ఉన్న సంకెళ్లు తొలగించడంతో ప్రభాకర్ పొలాల్లోకి పారిపోయాడు. పోలీసులు వెంబడించినా దొరకలేదు. దీంతో అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీనిపై కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ విలేకర్లతో సమావేశంలో మాట్లాడుతూ వ్యాన్‌లో ముగ్గు రు ఖైదీలు ఉన్నారని, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ కోసం ఏపీ, తెలంగాణలో గాలింపు ముమ్మరం చేశామన్నారు. ప్రభాకర్ గతంలో దేవరపల్లి ప్రాంతంలో ఒక స్కూల్ వద్ద రూ.3 లక్షలు నగదును చోరీ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడని, తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరంలోని ఒక కాలేజీలో రూ.30 లక్షలు చోరీ కేసులో నిందితుడిగా ఉన్నట్టు పేర్కొన్నారు. ప్రభాకర్‌ను పట్టుకోవడానికి 15 మంది చొప్పున 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డ్రోన్‌తో సాంకేతిక పరిజ్ఞానంతో చెక్ పోస్టుల ద్వారా జాబ్‌కార్డుల తోనూ ముమ్మరంగా దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. ఏలూరు ఐజీ అశోక్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలు, సూచనల మేరకు నిందితు డిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. బత్తుల ప్రభాకర్ ఏపీ, తెలంగాణలో 90 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. ప్రభాకర్‌ను త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు.

విజయవాడ నుంచే దసరా బస్‌లు

- జిల్లా నుంచి 170 కేటాయింపు
- విజయవాడ నుంచే సర్వీసులు
- 4 డిపోల నుంచి తరలింపు
- అక్కడి నుంచే నిర్వహణ
- నేటి నుంచి 2వరకు బస్‌లు



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్టీసీ ఈ ఏడాది దసరా స్పెషల్స్ నడపడంలేదు. షెడ్యూలు బస్సులను మాత్రమే తిప్పుతారు. స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో మాదిరిగా ఏ జిల్లాకు ఆ జిల్లా కాకుండా బస్సులన్నింటినీ విజయవాడ రప్పిస్తున్నారు. అక్కడి నుంచే అన్ని జిల్లాలకు దసరా బస్సులను ఆపరేట్ చేస్తారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా జిల్లాలోని అన్ని డిపోలకు బస్సులను పంపిస్తారు.ఈ మేరకు దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి జిల్లా ఆర్టీసీ అధికార యంత్రాంగానికి సమాచారం అందింది. దసరా పండుగ రోజుల్లో తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోలకు మొత్తం 170 బస్సులను నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. 24వ తేదీ బుధవారం 9 బస్సులు నడుపుతారు. 25వ తేదీన 16 బస్సులు ఆపరేట్ చేస్తారు. 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ 22 బస్సులు, 29వ తేదీన 24 బస్సులు వస్తాయి. 30వ తేదీ, అక్టోబరు 1న 22 బస్సులు చొప్పున, 2వ తేదీన 11 బస్సులు నడుపుతారు. 170 బస్సులు జిల్లాలోని నాలుగు డిపోలకు చెందినవే. డ్రైవర్లు, కండక్టర్లు ఇక్కడి వారే. ఆర్టీసీ సిబ్బంది ప్రతిరోజూ బస్సులను విజయవాడ తీసుకెళ్లి అక్కడి అధికారులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా విజయవాడ అధికారులు బస్సులను జిల్లాకు పంపిస్తారు.ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ ఈ బస్సులు నడుపుతారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఇబ్బంది పడ కుండా బస్‌లు నడిపేలా చర్యలు చేపట్టాం.

170 బస్‌లు పంపుతున్నాం..



దసరా పండుగ నేపథ్యంలో జిల్లాకు వచ్చే ప్రజల సౌకర్యార్థం విజయవాడకు 170 బస్సులు పంపుతున్నాం. ఇవన్నీ అదనపు సర్వీసులు. అక్కడి నుంచే ఈ బస్సులను ఆపరేట్ చేస్తారు. మహిళల ఉచిత ప్రయాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- వైఎస్ఎన్.మూర్తి,జిల్లా ప్రజారవాణా అధికారి

నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడిని కలిసిన వైద్యసిబ్బంది


వెంకటరమణకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న వైద్య బృందం

నల్లజర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల సొసైటీకి నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు రావూరి వెంకట రమణకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది మంగళవారం నల్లజర్ల సొసైటీ వద్ద మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రావూరి గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగాధర్, డాక్టర్ సిరాజుద్దీన్, వైద్య సంఘం అధ్యక్షుడు జీవీవీ ప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు


ఉండ్రాజవరంలో టీబీ రోగులకు కిట్లను అందజేస్తున్న వైద్యులు, తదితరులు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో మంగళవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్. ఉషాదేవి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రధానంగా మహిళలకు వచ్చే బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్లు, మధుమేహం, రక్తపోట్లు వంటి వాటిపై పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిబిరంలో స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం. వెంకట్రావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామమూర్తి, టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: స్త్రీ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని కానూరు పీహెచ్‌సీ డాక్టర్లు వీ. తేజశ్రీ, కే. హేమరాజు పేర్కొన్నారు. కానూరు అగ్రహారంలో మంగళవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు క్యాన్సర్ లక్షణాలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. కార్యక్రమంలో గ్రామప్రముఖ్ దాసం వెంకన్న, హరిదాసు సుబ్బారావు, హనుమంతు సుబ్రహ్మణ్యం, దాసం బాపన్న నాయుడు, దాసం మాణిక్యం, పాలా వెంకటేష్, హనుమంతు నాగేశ్వరరావు, సంగీతం శ్రీనివాసు, దాసం సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


పెరవలిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తేజశ్రీ

తుమ్మలమ్మ తల్లి ఆలయ నూతన కమిటీ ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న నూతన కమిటీ సభ్యులు

నల్లజర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం తుమ్మలమ్మ తల్లి ఎగువ, దిగువ ఆలయాలకు సంబంధించి మంగళవారం ఏక కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెల్లు వీర వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా తలం శెట్టి చిన్న వెంకట్రావు, కార్యదర్శిగా తలంశెట్టి మోహన్, కోశాధికారిగా గుళ్ళపూడి వెంకటరత్నం, సభ్యులుగా కలగర చిన్న వెంకట్రావు, గోపవరపు వీరయ్య, చలారి రాంబాబు, కొరపాటి రామకృష్ణ, గాలింకి సుబ్బారావు, కూసం పూడి వెంకటేశ్వరరావు (బుజ్జి), చెల్లు సత్యనారాయణ, చెల్లు శివబాబు, తలం శెట్టి రామారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం టీడీపీ గ్రామ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న ఇంటి వద్ద జరిగింది. ఈ సందర్భంగా ధర్మకర్త తలంశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ తనపై పలువురు అసత్య ప్రచారం చేయడం తగదన్నారు.

మెగా ఆధార్ క్యాంపులు : ఎంపీడీవో

పెరవలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 23 నుంచి 26 వ తేదీ వరకు మెగా ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కే. ఉమారాజ్యలక్ష్మి తెలిపారు. పెరవలి, ఉసులుమర్రు, పీ. వేమవరం, ఖండవల్లిలో ఈ క్యాంపులు జరుగుతాయన్నారు. బయోమెట్రిక్, ఫోన్ నెంబర్ల లింక్, పుట్టిన తేదీల్లో మార్పులు చేసుకోవచ్చునని ఆమె సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి
● ప్రభుత్వ ఆసుపత్రిలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్
● 168 మంది మహిళలకు వైద్యపరీక్షలు


మహిళకు సరుకులు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ, ఫ్యామిలీ ప్లానింగ్, మహిళల సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి రోగాల లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. ఎం.పద్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్యసేవలను ప్రారంభించారు. అనంతరం ఎస్ఎన్ఎస్‌పీఏ బ్రోచర్‌ను ఆవిష్కరించి, పౌష్టికాహార కిట్లను పంపిణీచేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యపరంగా అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. క్యాన్సర్ వంటి రోగాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్య సిబ్బంది విధి నిర్వహణను బాధ్యతాయుతంగా వైద్యసేవలు అందజేయాలన్నారు. అనంతరం 162 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆబా హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. రక్త పరీక్షలు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు, కంటి, గైనకాలజీ, ప్రసూతి, మహిళల విభాగం సేవలు, ఇఎన్‌టి, పిల్లలకు చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్య, కొవ్వూరు, ఆనపర్తి ఆసుపత్రులకు చెందిన వైద్యులు కె.శారద, ఎస్. ధర్మరాజు, ఎం. కోటేశ్వరి, జీ.హేమంత్, శాంతికమల, వాణి, సీహెచ్ ఆనంద్‌కుమార్, డీ.తరుణ్, సుశీల, ఆయుష్ డా. విజయకుమారి, టీబీ నిక్షయమిత్రలు, న్యూట్రిషన్ కౌన్సిలర్లు, జీఎస్ఎల్ నుంచి 12 మంది పీజీ వైద్య విద్యార్థులు, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిపై భాగంలో జరుగుతున్న స్లాబ్ లీకేజీ మరమ్మతు పనులను పరిశీలించి, ఆసుపత్రి సిబ్బందికి సూచనలు అందజేశారు.

పోతవరం సొసైటీలో ఉచిత వైద్యశిబిరం


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

నల్లజర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోతవరం సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీన్ని సొసైటీ చైర్మన్ పసుమర్తి ప్రభాకరరావు ప్రారంభించారు. ఇందులో డాక్టర్ పీడీఎస్ వెంకట్ (జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోస్కోపి) డాక్టర్ మృదుల (స్త్రీ వైద్యనిపుణులు, పెర్టిలిటీ నిపుణులు), డాక్టర్ శోభారాణి (చిన్నపిల్లల వైద్య నిపుణులు) పాల్గొని 300 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు గన్నమనేని వెంకటేశ్వరరావు, పసుమర్తి కృష్ణారావు, సొసైటీ కార్యదర్శి కాపూరి శ్రీనివాసరావు, బొర్రా చిన్నపుల్లయ్య పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే .. రేపటి భవిష్యత్ పారిశ్రామిక వేత్తలు

● ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్


విద్యార్థులతో క్లీనింగ్ పౌడర్ తయారు చేయిస్తున్న అధ్యాపకులు

కొవ్వూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ, విద్యార్థులు భవిష్యత్‌లో ఎంట్రపెన్యూర్లుగా ఎదగడానికి వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. రామ్మోహన్ అన్నారు. కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం రసాయనశాస్త్రం, లైఫ్‌సైన్సెస్ విభాగం సంయుక్త ఆధ్వ ర్యంలో దేశీయ సంరక్షణ ఉత్పత్తులపై నైపుణ్యా భివృద్ధి వర్క్ షాప్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులు తయారుచేసిన వస్తువుల ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు వర్క్‌షాప్‌లు పెట్టి శిక్షణ ఇవ్వడం ద్వారా వారు భవిష్యత్‌లో పారిశ్రామిక వేత్తలుగా ఎదిగా అనేక మందికి ఉపాధి కల్పిస్తారన్నారు. రాజమహేంద్రవరం కందుకూరి రాజ్యలక్ష్మి గవర్నమెంట్ కాలేజ్ రిసోర్సుపర్సన్ డా.ఏ.వసుంధరాదేవి, డా.ఎం.సునీత, ఎన్.స్వాతి, కళాశాల రసాయన శాస్త్రం లెక్చరర్, వైస్ ప్రిన్సిపాల్ డా. యల్లాప్రగడ రమేష్ విద్యార్థులకు క్లీనింగ్ పౌడర్‌లు, డిటర్జెంట్, వ్యక్తిగత సంరక్షణ వస్తువులు వంటి సురక్షితమైన పర్యావరణ అనుకూలమైన, స్వల్ప ఖర్చుతో కూడుకున్న గృహ సంరక్షణ ఉత్పత్తులను ఎలా తయారుచేయాలో విద్యార్థులకు ఆచరణాత్మకముగా నేర్పించారు. కార్యక్రమంలో ఏలూరు సర్ సీఆర్ రెడ్డి కళాశాల, కొవ్వూరు ఎస్‌వీజే సంస్కృత కళాశాల, ఏబీఎన్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సీహెచ్ బాలాజీ, పీజీ డైరెక్టర్ డా. చలపతిరావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి


చాగల్లులో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

చాగల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాడి పశువులకు, దూడలకు గాలికుంటు నివారణ కార్యక్రమం జరుగుతుందని పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి యు ముఖేష్ కోరారు. మండలంలో గత వారం రోజులుగా గాలికుంటు నిఎవారణ టీకాలు వేస్తున్నామని ఇప్పటి వరకు 752 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. మండలంలోని నెలటూరు, గౌరిపల్లి, మల్లవరం, చంద్రవరం, గ్రామాల్లో టీకాలు వేసే కార్యక్రమం పూర్తయ్యిందని మిగిలిన గ్రామాల్లోని రైతులు ఈఅవకాశంను సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం తెలిపారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్స్ ఏలూరు శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ గుడివరం బ్రాంచ్ మేనేజర్ గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ఏమనగా పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలం, [illegible] గ్రామ కాపురస్తులు [illegible] సత్యనారాయణ గారి భార్య [illegible] గారికి చెందిన ఈ దిగువ షెడ్యూలు రాశిలా [illegible]

షెడ్యూలు

[illegible] 100చ.గ. స్థలము హద్దులు.
తూర్పు : [illegible] గారి స్థలం
దక్షిణం : రోడ్డు
పడమర : [illegible] సీతారామయ్య గారి స్థలం
ఉత్తరం : [illegible] సీతారామయ్య గారి స్థలం
ఈ హద్దుల మధ్య చ.గ.100లు స్థలము [illegible]

P. వేణుగోపాలచౌదరి, అడ్వకేట్
Cell: 93469 60787 [illegible]

బహిరంగ ప్రకటన

[illegible]

అదనపు సాయాన్ని ఉపయోగించుకోవాలి


ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ నాతి బుజ్జి

పెరవలి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మించుకునేవారికి అదనంగా ఇస్తున్న ఆర్థిక సాయాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాతి బుజ్జి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో హౌసింగ్ లేఅవుట్లను, ఇంటి నిర్మాణ పనుల ప్రగతిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శేఖర్‌బాబు, హౌసింగ్ ఏఈ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లరిబ్బన్లతో విధులకు ..


నల్లరిబ్బన్లతో సచివాలయ ఉన్న సిబ్బంది

తాళ్లపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి అక్టోబరు 5వ తారీఖు వరకూ నల్ల రిబ్బన్లతోనే విధులకు హాజరవుతామని తాళ్లపూడి సచివాలయ ఉద్యోగులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం వారంతా మాట్లాడుతూ వాలంటీర్లు నిర్వహించే విధులన్నింటినీ సచివాలయ ఉద్యోగులపై రుద్దటంతో, వాటిని వ్యతిరేకిస్తూ రాష్ట్రనాయకత్వం ఆదేశాలతో నిరసన తెలుపుతూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామన్నారు. అలాగే భోజన విరామ సమయంలో తమ కార్యాలయాల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాల సమస్యలు పరిష్కరించండి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ఆ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వీర్లపల్లి ఏసు వినతిపత్రం అందించారు. రాజమహేంద్రవరంలో ఎంపీని కలిసి తమ సమస్యలను వివరించారు. పిల్లల చదువుల విషయంలో ఎదురౌతున్న సమస్యలు విన్న ఎంపీ తప్పక దీనిపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామని చెప్పారు.

విద్యార్థులు చెడువ్యసనాలకు లోనుకావద్దు : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

దేవరపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యనభ్యసిస్తే.. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి అన్నారు. దేవరపల్లిలోని ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కాలేజీలో మంగళవారం ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై ప్రసంగిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థి సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంపీ చేతులమీదుగా మెమెంటోలు అందజేశారు. మెట్ట ప్రాంతంలో సామాన్యులకు మెరుగైన విద్యనందిస్తున్న సువర్ణరాజును ఎంపీ అభినందించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు, జనసేన పార్టీ నాయకురాలు ముద్రగడ క్రాంతి, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనీల్, గోపాలపురం అధ్యక్షుడు కొర్లపాటి రాము, సొసైటీ అధ్యక్షులు ఉప్పులూరి రామారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పీ.నాగేంద్ర, కాకర్ల రామతులసి, బలుసు సత్యనారాయణ, కంబాల సత్తిబాబు, పసుపులేటి శివనాగప్రసాద్, ప్రిన్సిపల్ కుమార్, విక్రమ్, ఏవో ఆనంద్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మా దుర్గమ్మ... కరుణించు

భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రులు


కొవ్వూరు గాయత్రీమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కొవ్వూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజైన మంగళవారమూ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరణచేసి విశేష పూజలు నిర్వహించారు. గోష్పాద క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయం, జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, సంస్కృత పాఠశాలలోని శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి అలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికుల ఆధ్వ ర్యంలో, మున్సిపల్ కార్యాలయం ఎదుట కనకదుర్గమ్మ ఆలయం, మెరక వీధి, లాంచీల రేవు కనకదుర్గమ్మ ఆలయాలు, మెయిన్‌రోడ్డులోని గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయంలో, రామా సొసైటీ సమీపంలో యూత్ ఆధ్వర్యంలో, ఇందిరమ్మకాలనీలో, రెల్లిపేట నూకాలమ్మ ఆలయం, మండలంలోని తోగుమ్మి కొత్తపేటలో వేంచేసియున్న విజయ కనక దుర్గాదేవి ఆలయంలో, పశివేదల తూర్పుకాపుల వీధిలో శ్రీదుర్గామహేశ్వర ఆలయం, వాడపల్లి గ్రామదేవతలు పుట్టాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయం, సీతంపేట సెంటర్‌లో ఉన్న కనక దుర్గమ్మ ఆలయం, దొమ్మేరు, వేములూరు, పంగిడిలో దేవీనవరాత్రులను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిడదవోలు: నిడదవోలు గ్రామదేవత నాంగల్యదేవికి, రాజరాజేశ్వరి సమేత గోలిగేశ్వరస్వామి వారి ఆలయంలోని రాజరాజేశ్వరి దేవికి, బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలోని బాలాత్రిపుర సుందరికి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వాసవీమాతకు, గాంధీనగర్‌లోని దానమ్మతల్లికి, గోపవరంలో వేంచేసి వున్న గుబ్బాలమ్మకి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా విశేషపూజలు నిర్వహించారు.

చాగల్లు: మండల కేంద్రమైన చాగల్లులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మంగళవారం గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భజన కార్యక్రమం జరిగింది. అలాగే గ్రామదేవత పాటెమ్మ వారి ఆలయంలోనూ విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉండ్రాజవరం: మండలంలో దసరా ఉత్సవాలు సందర్భంగా పలు గ్రామాల్లో వేడుకలను సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. మంగళవారం పాలంగిలోని కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మోర్త విజయ కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద అమ్మవారికి విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు.


కోటసత్తెమ్మ వారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆర్ట్స్ కళాశాలకు 60 ఎంబీఏ సీట్లు : ఎమ్మెల్యే


లోకేశ్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):చారిత్రాత్మక ఆర్ట్స్ కళాశాలకు 60 ఎంబీఏ సీట్లు సాధించినట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ సీట్లు విషయాన్ని ఆర్ట్స్ కళాశాల యాజమాన్యం గతంలో తన దృష్టికి తీసుకువచ్చిందని, దాన్ని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయ న ఉన్నత విద్య విభాగం అధికారులతో మాట్లాడి ఆర్ట్స్ కళాశాలలో ఎంబీఏకు 60 సీట్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఎంబీఏ కోర్సును ఏర్పాటు చేసేందుకు చర్య లు తీసుకున్న మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో అల్లు రామలింగయ్య హోమియో కళాశాలలో మరుగునపడిపోయిన 26 పీజీ సీట్లను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరించామని ఎమ్మెల్యే వాసు గుర్తుచేశారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువస్తూ ప్రగతి పథంలో రాష్ట్రాంలో విద్యను పటిష్టం చెయ్యడంలో మంత్రి నారా లోకేష్ చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆదిరెడ్డి వాసు చెప్పారు.

మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం

రాజమహేంద్రవరంలో ఈ నెల 28 వరకు జరుగనున్న యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్- 2025 పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే వాసు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలో లోకేశ్‌ను ఆయన చాంబర్‌లో కలిసి ఆహ్వానపత్రాన్ని అందించారు.

పీ4పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ/ బిక్కవోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4(పబ్లిక్, ప్రవేట్, పీపుల్ పార్టనర్ షిప్) కార్యక్రమం అమలులో సచివాయల ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్ అన్నారు. పీ4 అమలుపై సచివాలయ ఉద్యోగులకు రాజమహేంద్రవరం కళాకేంద్రంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విజన్-2047 లక్ష్యాల్లో భాగంగా పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. అలాగే మొబైల్ యాప్‌లో బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయడం, యాప్‌లో ఆప్షన్ అప్డేట్ చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. కార్పొరేషన్ సెక్రటరీ జి.శైలజవల్లి, ఏఎస్‌వోకే ప్రసాద్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఏఎస్‌వీ హరికృష్ణ, యంగ్ ప్రొఫెషనల్ కె.దుర్గా భవాని పాల్గొన్నారు. బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారి వీఎస్ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలోనూ జరిగింది.

ఎంపీడీవోకు అంగన్‌వాడీ కార్యకర్తల వినతి

తాళ్లపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తామంతా పింఛన్లు పంచేందుకు గాను విధులకు హాజర్వ్వాలని ఎటువంటి ఆదేశాలు గానీ, జీవోలు గానీ లేవని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా వారంతా మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద మాట్లాడుతూ తమకున్న విధులతో పాటు అదనంగా పింఛన్లు పంచే బాధ్యతను ప్రభుత్వం అప్పగించిదని, దాన్నుంచి తమను తప్పించాలని కోరుతూ ఎంపీడీవో వేణుగోపాలరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు కుటుంబానికి అండగా మంత్రి దుర్గేష్


ఎన్‌వోసీ పత్రం అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శింగవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనారోగ్యానికి గురై వైద్య చికిత్స పొందుతున్నాడు. దీనిలో భాగంగా ఆయన కుటుంబానికి అండగా మంత్రి దుర్గేష్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 4,50,000/లకు ఎన్ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

కైవల్యారెడ్డికి అభినందనలు


అభినందిస్తున్న కొవ్వూరు డీఎల్‌డీవో స్లేవారెడ్డి

నిడదవోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణానికి చెందిన విద్యార్థి కైవల్యారెడ్డి జర్మనీకి చెందిన సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ కాంపిటేషన్‌లో ఫైనల్ రౌండ్ పూర్తి చేసుకుని సిల్వర్ హానర్ సర్టిఫికెట్ సాధించిన సందర్భంగా మంగళవారం సమిశ్రగూడెంలోని ఎంపీడీవో కార్యాలయంలో డీఎల్‌డీవో ఏ.స్లేవారెడ్డి, ఎంపీడీవో జగన్నాథరావు ప్రత్యేకంగా అభినందించారు.